## మానవత్వానికి ముద్ర వేసిన.. పోలీసు అధికారి

**: గుర్తు తెలియని మృతదేహాలకు గౌరవప్రద అంతిమసంస్కారాలు**

**ప్రశంసా పత్ర గ్రహీతకు స్థానిక పోలీసుల సన్మానం**



**కర్నూలు ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి:** కర్నూలు 4వ పట్టణ పోలీస్ స్టేషన్ కు చెందిన హెడ్ కానిస్టేబుల్ హెచ్ సి1809 ఎస్.హసన్ అహ్మద్ తన కర్తవ్యపరమైన నిబద్ధతతో పాటు మానవత్వంతో కూడిన సేవలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఇన్‌క్వెస్ట్ (మరణపరిశీలన) సమయంలో విచారణాధికారికి సమగ్ర సహకారం అందించడం, అలాగే గుర్తు తెలియని మృత దేహాలను చట్టపరమైన విధానాల ప్రకారం గౌరవప్రదంగా నిర్వహించడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. అసహజ మరణాల సమాచారం అందిన వెంటనే హసన్ అహ్మద్ గారు సంఘటన స్థలానికి చేరుకుని ఆ ప్రదేశాన్ని భద్రపరచడం, ఆధారాలను కాపాడడం, పంచనామాలు సిద్ధం చేయడం, ఫోటోలు, మ్యాపులు రూపొందించడం, మెడికల్ సిబ్బంది, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేయడం వంటి పనులను చట్టపరమైన నిబంధనల ప్రకారం కచ్చితంగా నిర్వహిస్తున్నారు. గుర్తు తెలియని మృతదేహాల విషయంలో ముందుగా అన్ని గుర్తింపు ప్రయత్నాలు చేస్తారు వివరణాత్మక మెమోలు పంపడం, ఫింగర్ ప్రింట్లు సేకరించడం, ప్రత్యేక గుర్తులు నమోదు చేయడం, మిస్సింగ్ కేసులతో సరిపోల్చడం, సమీప పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించడం. అయినప్పటికీ గుర్తింపు సాధ్యం కానప్పుడు, మున్సిపల్ సిబ్బంది, సేవా సంస్థల సహకారంతో గౌరవప్రదంగా అంత్యక్రియలు జరగేలా చూస్తారు. అన్ని రికార్డులు, ఫోటోలు కూడా భద్రపరుస్తారు. హాస్పిటల్ సిబ్బంది, మున్సిపల్ కార్మికులు, అంబులెన్స్ డ్రైవర్లు, ఎన్జీవోలతో ఆయన సమన్వయం విశేషంగా ఉంటుంది. సంఘటన స్థలానికి వచ్చిన కుటుంబ సభ్యులకు శాంతంగా, స్పష్టంగా వివరించడం ద్వారా ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్నారు. పోలీసు విభాగంలో తన కర్తవ్యనిబద్ధత, మానవత్వం, మరియు చట్టబద్ధత పట్ల కట్టుబాటుతో హెడ్ కానిస్టేబుల్ హెచ్ సి1809 హసన్ అహ్మద్ గారు ప్రశంసకు అర్హులని నాలుగవ పట్టణ సీఐ విక్రమ సింహ గారు ఎస్సై చంద్రశేఖర్ రెడ్డి మరియు మోహన్ కిషోర్ లు సహచర సిబ్బంది హసన్ యొక్క సేవలను కొనియాడుతూ ఘనంగా సన్మానించారు,,,

## చెరువులో పడి..
## ఎద్దులతో సహా.. రైతుమృతి..!

**: ఆలమూరు గ్రామంలో విషాదఛాయలు**





**రుద్రవరం, ఆగస్టు 16, ప్రభాతవార్త :** మండలంలోని ఆలమూరు గ్రామ సమీపంలోని శీలబోయిన చెరువులో శనివారం ప్రమాదవశాత్తూ పడి రెండు ఎద్దులు, రైతు గోవిందిన్నె హుసేన్‌బాష‘42) మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తుల వివరాలమేరకు హుసేన్‌బాష గ్రామ సమీపంలోఉన్న పంట పొలాల్లో వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో దారి ప్రక్కనే ఉన్న శీలబోయిన చెరువులో ఎద్దులను శుభ్రం చేసేందుకు బండితో సహా చెరువులోకి వెళ్లి ఎద్దులను శుభ్రం చేస్తుండగా నీటిలో శబ్దం రావడంతో ఎద్దులు ఒక్కసారిగా బెదిరి చెరువులోపల ఉన్న పెద్ద గుంతలోకి బండితో సహా వెళ్లాయి. దీంతో రైతు హుసేన్‌బాషతో సహా ఎద్దులకు ఊపిరాడక అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. ఇది గమనించిన పంట పొలాల్లోని రైతులు అక్కడికి చేరుకుని చెరువులో చిక్కుకుని మృతిచెందిన ఎద్దులను, హుసేన్‌బాష మృతదేహాన్ని బయటకు తీశారు. మృతునికి భార్య పర్వీన్, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

**సంఘటనాస్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ:** శీలబోయిన చెరువులో ప్రమాదవశాత్తూ పడి రెండు ఎద్దులతో సహా రైతు మృతిచెందడంతో రుద్రవరం ఎస్ఐ మహమ్మద్‌రఫీ సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ప్రమాద తీరును అక్కడ ఉన్న రైతులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని భార్య పర్వీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# ఖద్దరు మాటున.. రౌడీయిజం..!

- మితిమీరుతున్న రౌడీ షీటర్లు..?
- రాజకీయ ముసుగులో నేరాలు
- దందాలు, భూ కబ్జాలే అధికం
- బైండోవర్లతోనే సరి...!
- జిల్లా పోలీసు యంత్రాంగమే.. రౌడీషీటర్లను కట్టడి చేయాలి

**ఒకప్పుడు రౌడీల పక్కన నిలబడాలంటేనే .. రాజకీయ నేతలు సిగ్గుపడేవాళ్లని ఏపీ సీఎం చంద్రబాబు గత కొన్ని రోజుల క్రితం ఓ సమావేశంలో అన్నారు. ఇప్పుడు రౌడీలే రాజకీయాలు చేస్తున్నారని కూడ ఆరోపించారు. రాజకీయం ముసుగులో నేరాలు చేసేవాళ్ల ముసుగు తీస్తామని సీఎం చంద్రబాబు వార్నింగ్ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఫ్రెండ్లీ పోలీస్ పుణ్యమా? అని జిల్లాలో, మండలాల్లో, పల్లెల్లో రౌడీ షీటర్లు పెట్రేగిపోతున్నారు. పోలీసులన్నా, పోలీస్ స్టేషనులన్నా వీరికి ఏమాత్రం గౌరవం, భయం, భక్తి లేదనిపిస్తోంది.**



**కర్నూలు ఆగస్టు 17, ప్రభాతవార్త ప్రతినిధి :** జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా వ్యాప్తంగా వందలాది మంది రౌడీ షీటర్లు ఉన్నట్లు పోలీస్ రికార్డుల ద్వారా స్పష్టమవుతోంది. వీరిలో ప్రధానంగా కొడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, కోసిగి, దేవనకొండ, పత్తికొండ, కర్నూలు పట్టణంలోని షరీఫ్ నగర్, బుధువార్ పేట, బళ్లారి చౌరస్తా, తదితర ప్రాంతాల్లో అధికంగా ఉండడం గమనార్హం. అయితే, వీరిలో కొందరు ప్రస్తుతం రాజకీయ ముసుగులో కద్దర్ చొక్కా మాటున ఖాకీలను శాసిస్తూ వారిని బురిడీ కొట్టిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వీరిలో కొందరు అధికార పార్టీలో కొనసాగుతుండగా, మరికొందరు వైసిపి వంటి పార్టీలోనూ ఉన్నారు. ఇంకొందరు సొంత వ్యాపారం, వ్యవసాయం, రియల్ దందాలు సాగిస్తున్నారు. రాజకీయ ముసుగులో కొందరు రౌడీషీటర్లు తమ అధికార పలుకుబడితోపాటు రౌడీయిజాన్ని చెలాయిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఎన్నికలవేళ రౌడీషీటర్లను కట్టడి చేయాల్సిన పోలీస్ అధికారులు ఉదాసీనంగా వ్యవహరించడం వల్లే రౌడీలు తమ కార్యకలాపాలను చక్కదిద్దుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**చూసీచూడనట్లుగా ఖాకీలు..?** జిల్లాలోని పలు నియోజకవర్గాల్లోని రౌడీ షీటర్ లపై ఇప్పటికే పదుల సంఖ్యలో కేసులు ఉన్నాయి. ఓ రౌడీషీటర్ పది, ఇరవై మందిని వెనకేసుకొని భూ కబ్జాలు, దందాలు, ప్రశ్నించిన వారిపై దాడులు చేసినా ఒక్కసారి కూడా పోలీసులు వారిని రిమాండ్ చేసింది లేదు, కోర్టు మెట్లు ఎక్కించిన దాఖలాలు అంతకన్నా లేవనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో పోలీస్ అధికారుల తీరుపై సర్వత్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సరైన సాక్ష్యాలున్నా కోర్టులో ప్రొడ్యూస్ చేయలేక, అతడికి అధికారులు సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఓ రౌడీషీటర్ అయితే ఏకంగా ఓ మాజీ ఎమ్మెల్యే పేరు చెప్పి తన కార్యకలాపాలన్నిటినీ కొనసాగిస్తూ బదిలీపై వెళ్లిన పోలీసులను కూడా బెదిరింపులకు గురి చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో అతడిపై ఎన్ని కేసులు ఉన్నా కూడా పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. రౌడీ షీటర్లు నెలకు, రెండు నుంచి నాలుగు సార్లు పోలీస్ స్టేషన్లలో హాజరై సంతకాలు చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా సత్ప్రవర్తనతో మెలగాల్సిన అవసరం ఎంతో ఉంది. వీరికి సంబంధించిన పాస్ పోర్ట్, ఇతర దరఖాస్తులను అనుతించరు. రాజకీయ ముసుగులో చలామణి అవుతున్న రౌడీ షీటర్ లపై ప్రతి ఏడాదికి సగటున రెండు, మూడు కేసులు నమోదు అవుతున్నా కూడా పోలీసులు ఇంతవరకు అరెస్టు చేసింది లేదనే విమర్శలు ఉన్నాయి. ఈ రౌడీషీటర్ల పట్ల పోలీసుల అనుసరిస్తున్న విధానాన్ని చూసి ప్రజలే ముక్కున వేలేసుకుంటున్నారు.

**బైండోవర్లతోనే సరి...!** గత వైసీపీ హయాంలో పనిచేసిన పోలీసు అధికారులు రౌడీషీటర్‌లను తహశీల్దార్ల ఎదుట బైండోవర్ చేసి వదిలేయడంతో వారి దందాకు, దౌర్జన్యాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. అంతేకాక సదరు రౌడీషీటర్ లపై నిత్యం సామాజిక మాధ్యమాల్లో భూ కబ్జాలకు పాల్పడినట్లు బాహాటంగానే అనేక విమర్శలు వెల్లువెత్తుతూనే ఉన్నాయి. ఇలాంటివారిని బైండోవర్లతో సరిపెట్టకుండా కటకటాలకు నెట్టి కఠినంగా శిక్షించాలని పలువురు కోరుతున్నారు. లేకపోతే ఎన్నికల సమయంలో వీరి నుంచి ప్రజలు ఇబ్బందులకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని పలువురు వాపోతున్నారు. ఇటువంటి వారి పట్ల జిల్లా పోలీస్ యంత్రాంగం దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అంటున్నారు. అంతేకాకుండా రాజకీయ పార్టీల నాయకులు కూడా ఇలాంటి రౌడీ షీటర్ల ను పార్టీకి దూరంగా ఉంచితే మంచిదంటున్నారు ప్రజలు.

## ప్రజా సమస్యల అర్జీలను స్వీకరించిన మంత్రి బీసీ

**బనగానపల్లె రూరల్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చిన వినతులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ఆదేశించారు. నేటి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో వివిధ వర్గాల ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బాధితుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడిక్కడే చరవాణి తో మాట్లాడి పరిష్కరించడం జరిగింది. ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమంలో ఆయా సమస్యలపై మంత్రి స్పందించిన తీరుతో బాధితుల నుంచి ఆనందం వ్యక్తం అవుతుంది. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చారు.



## కొత్త పంథాలో..వడ్డీ దందా..!

- నగదుకు హామీగా స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు
- చెల్లింపులు ఆలస్యమైతే రెట్టింపు వసూళ్లు
- లేదంటే తిరిగి ఆస్థుల ఇచ్చేదిలేదంటూ హెచ్చరికలు
- ఆర్థికంగా నష్టపోయి వీధినపడుతున్న కుటుంబాలు
- సామాన్యులను పీల్చి పిప్పి చేస్తున్న వడ్డీ వ్యాపారులు
- ఛిద్రమౌతున్న చిరు వ్యాపారుల బతుకులు
- ఎమ్మిగనూరులో మళ్లీ జడలు విప్పుతున్న వడ్డీ వ్యాపారం
- ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతున్న వైనం

**“గతంలో తమ వద్ద ఖాళీ ప్రామిసరీ నోట్లు, చెక్కులు పెట్టుకుని వడ్డీ దందా చేసుకునే వారు. రానురాను ఆ దందా పంథా మార్చారు. నగదు అవసరం ఉన్న వ్యక్తులే లక్ష్యంగా చేసి ఆ దందాలో కొంతకాలం తనఖా రిజిస్ట్రేషన్లు చేయించుకుని ఆ తర్వాత పూర్తి నగదు చెల్లిస్తేనే తిరిగి రిజిస్ట్రేషన్లు చేసేవారు. అయితే తనఖా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటే నగదు తీసుకున్న వ్యక్తులు కోర్టుకు వెళ్తే.. తమ లెక్కలన్నీ బయటకొచ్చే ప్రమాదం ఉందని గ్రహించిన వడ్డీ వ్యాపారులు..ఇప్పుడు ఏకంగా సేల్ డీడ్‌లు రాయించుకోవడం మొదలు పెట్టారు. నగదు అవసరం ఉన్న వారి నుంచి ఇళ్లు, ఖాళీ స్థలాలను తమ పేరుతో కొనుగోలు చేసినట్టుగా రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. ఆ తర్వాత వడ్డీకి నగదు తీసుకున్న వారి నుంచి జరిగే చెల్లింపులు ఇతర వ్యవహారాలన్నీ తెల్లకాగితాలపైనే రాసుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల ఎవరైనా పోలీసులను ఆశ్రయించినా, కోర్టుకు వెళ్లినా తాము కొనుగోలు చేశామనేందుకు ఆయా డ్యాకుమెంట్లను చూపిస్తోండటంతో బాధితులకు న్యాయం జరగడం లేదన్న వాదన వినిపిస్తోంది. కొందరు వడ్డీ వ్యాపారులు పరస్పర అంగీకార పత్రాలు రాసుకుంటున్నా తాము అడిగినంత వడ్డీ చెల్లిస్తేనే తిరిగి తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.”**

**ఎమ్మిగనూరు క్రైం, ఆగస్టు 16 ప్రభాతవార్త:**

**- అధికారుల హెచ్చరికలు ఇలా..!** వడ్డీ వ్యాపారం ముసుగులో దౌర్జన్యం చేస్తే ఉపేక్షించేది లేదు. నియోజకవర్గంలో జరుగుతున్న అక్రమ వడ్డీ వ్యాపారం పై నిఘాను పటిష్టం చేస్తున్నాం. బాధితులకు చట్టపరమైన సహకారం అందిస్తాం. ఎదుటివారి ఆర్థిక అవసరాలు, కష్టాలను ఆసరాగా చేసుకుని కొందరు వడ్డీ వ్యాపారులు ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్దంగా అప్పులిస్తూ సకాలంలో చెల్లించలేకపోతున్న వారిని వేధిస్తే చట్ట పరమైన చర్యలు తప్పవు. అధిక వడ్డీలు కట్టలేక ఆర్థిక ఒత్తిడి తట్టుకోలేక అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. అలాంటి సంఘటనలు నియోజకవర్గంలో పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్దంగా ఖాళీ చెక్కులు, ఏటిఎం కార్డులు, బంగారు ఆభరణాలు, పట్టాదారు పాసు పుస్తకాలు, ఇళ్లు, ఖాళీ స్థలాలు, వాహనాలు కుదవ పెట్టుకుని వడ్డీలకు ఇచ్చే దళారులే అత్యధికంగా ఉన్నట్లు సమాచారం. వారిపై దృష్టి సారించాం..ఇవి అధికారులు చేస్తున్న హెచ్చరికలు.

**- కోట్లలో అక్రమ వడ్డీ వ్యాపారం..!** ఎవరైనా అవసరాలకు నగదు తీసుకున్న తర్వాత సదరు వడ్డీ వ్యాపారులు చట్టబద్ధం కాని వడ్డీ వసూలు చేస్తారు. కానీ ఆయా వసూళ్ల మాత్రం కనబడవు. తీసకున్న నగదు మొత్తంతో పాటు వడీడ చెల్లించినా వారికి ఆ నగదు సరిపోదు. నగదు చెల్ ్లించడంలో వారం పది రోజులు ఆలస్యమైందా ఇక అంతే సంగతులు. మళ్లీ వడ్డీ నగదు....

• వివరాలు 2లో

## సర్దార్ గౌతు లచ్చన్న సేవలు మరువలేనివి : జిల్లా కలెక్టర్



**కర్నూలు, ఆగస్టు 16, ప్రభాతవార్త:** స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ గౌతు లచ్చన్న అణగారిన వర్గాలకోసం చేసిన సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని పురస్కరించుకుని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో వారి చిత్రపటానికి జిల్లా కలెక్టర్ , వివిధ సంఘాల ప్రతినిధులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర ౄద్యమం లో కీలకంగా వ్యవహరించిన సర్దార్ గౌతు లచ్చన్న జయంతిని ఏటా అధికారికంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం జరిగిందన్నారు. 1909 ఆగస్టు 16న శ్రీకాకుళం లోని బారువలో ఓ పేద కల్లుగీత కార్మిక కుటుంబంలో ఆయన జన్మించారన్నారు.. మెట్రిక్యులేషన్ చదువుతుండగానే 21వ ఏట గాంధీజీ పిలుపుతో స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు.. పలు ఉద్యమాలలో పాల్గొన్న గౌతు లచ్చన్న అనేకసార్లు జైలు శిక్ష అనుభవించారన్నారు.సమాజంలోని పేద, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని, ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రిగా ప్రజలకు సేవలందించారన్నారు. స్వాతంత్రోద్యమంలో వారు చూపిన పోరాట పటిమ యువతకు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

## తుంగభద్ర దిగువ కాలువలకు భారీగా.. నీరు విడుదల..!

**హాలహర్వి, ఆగస్టు16, ప్రభాతవార్త;** కర్ణాటకలోని విజయనగర జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర జలాశయానికి వరదనీరు భారీగా వస్తున్నాయి. దీంతో అప్రమత్తమై డ్యాం అధికారులు శనివారం 28 వేల క్యూసెక్కుల నీరు దిగువ కాలువలకు విడుదల చేశారు. డ్యాం గేట్లు శిథిలావస్థకు చేరుకోవడంతో ముందు జాగ్రత్త చరర్యగా నీరు దిగువ కాలువలకు విడుదల చేసినట్లు డ్యాం అధికారులు తెలిపారు. డ్యాం కెపాసిటీ 105 టీఎంసీలు ఉన్నప్పటికీ నిపుణుల సూచనల మేరకు డ్యాంలో ఎక్కువ నీరు నిల్వ ఉంచకుండా నీరు కాలువలకు విడుదల చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 80.3 టీఎంసీల నీరు నిల్వ ఉందని డ్యాం అధికారులు తెలిపారు.



## ప్రమాదమని తెలిసినా తప్పని.. పుట్టి ప్రయాణం..!

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న రెండు రాష్ట్రాల ప్రజలు
- పట్టించుకోని ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు



**హాలహర్వి, ఆగస్టు16, ప్రభాతవార్త;** కర్నూలు జిల్లా మారుమూల గ్రామమైన గూళ్యం గ్రామం సమీపంలో కర్ణాటక సరిహద్దులో వేదావతి నది ఉంది. ఈ వేదావతి నది ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు సరిహద్దులో ఉంది. గూళ్యం గ్రామం నుంచి కర్ణాటకకు బసరకోడు, మోకా, బళ్లారి, సిరుగుప్ప తదితర పట్టణాలకు వెళ్లాలంటే వేదావతి నది దాటి వెళ్లాల్సిందే. గూళ్యం గ్రామంలో వెలసిన శ్రీశ్రీగాదిలింగేశ్వరస్వామి దర్శనం కోసం వేలాది మంది భక్తులు కర్ణాటక నుంచి వస్తుంటారు. అయితే వేదావతి నదిపై వంతెన లేకపోవడంతో నదిలో ప్రయాణం చేయాలంటే వ్యయ ప్రయాసాలు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే ఇరు రాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోఆయి. అయితే కొంతమంది ప్రయాణకులు ప్రమాదమని తెలిసినా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పుట్టి ప్రయాణం చేస్తు న్నారు. ఇరు రాష్ట్రాల ప్రజలు వేదావతి నదిలో ప్రయాణం చేయడానికి ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడం లేదని ఇరు రాష్ట్రాల ప్రజలు వాపోతున్నారు.2005లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి కేంద్ర మంత్రిగా ఉన్న కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి వేదావతి నదిపై వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ ఇంతవరకు నెరవేరలేదు. అంతేగాకుండా కర్ణాటక మంత్రి శ్రీరాములు కూడా వేదావతి నదిపై వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. అయినా ఆ హామీ నెరవే రలేదు. ఇరు రాష్ట్రాల ప్రజలు చందాలు వేసుకుని వేదావతి నదిలో తాత్కాలిక వంతెన ఏర్పాటు చేసుకున్నారు. అయితే కురిసిన భారీ వర్షాలకు వేదావతి నదికి భారీగా వరదనీరు రావడంతో తాత్కాలిక వంతెన కొట్టుకుపోయింది. దీంతో ఇరురాష్ట్రాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భారీ వరదనీటిలో ఇరు రాష్ట్రాల ప్రజలు పుట్టి ప్రయాణం చేస్తు న్నారు. ఇప్పటికైనా ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు స్పందించి వేదావతి నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని ఇరు రాష్ట్రాల ప్రజలు కోరుతున్నారు.

## బంజరా ఉత్సవాలు

**కర్నూలు ఆగస్టు 16 ప్రభాతవార్త ప్రతినిధి :** ఘోర్ బంజారా తీజ్ ఉత్సవాలు శనివారం కర్నూలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు ఉత్సవాల చివరి రోజున పెద్ద ఎత్తున పాల్గొని మొలకెత్తిన గోధుమ గడ్డిని తలపై ఉంచుకుని కే సి కెనాల్ దగ్గర ఉన్న సత్యనారాయణ స్వామి ఆలయం నుండి కలెక్టరేట్ వరకు ఊరేగుంపు నిర్వహించి తిరిగి కే సి కెనాల్ నందు తలైపై ఉంచుకున్న గోధుమ గడ్డిని నిమజ్జనం చేశారు. ఈ సందర్బంగా ఉత్సవ కమిటీ వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.




## రైతుల కష్టం.. నేలపాలు..!

- వాగు పొంగింది...రైతులకు నష్టం మిగిలింది
- రెండురోజులుగా నీటిలోమునిగి తేలిన పంట పొలాలు
- రైతులకు నష్టపరిహారం అందించాలని కోట్ల చంద్రారెడ్డి



**పాములపాడు రూరల్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాములపాడు మండలంలోని చెలిమిల్ల, ఇస్కాల పొలిమేరలో సాగుచేసిన మొక్కజొన్న పంట నీటిలో మునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. బవనాసి నది, సుద్దవాగు పొంగిపొర్లడంతో నది పరివాహక పంట పొలాలు రెండురోజులుగా నీటిలో ఉండి శనివారం పంట మొత్తం నేలమట్టంగా కనిపించింది. ఎగువ ప్రాంతం నుంచి బవనాసి నది, సుద్దవాగుకు ఉధృతంగా నీరు రావడంతో పంట పొలాలు పూర్తిగా మునిగిపోయి తీవ్రంగా నష్టం వాటిల్లింది. శనివారం చెలిమిల్ల సర్పంచ్ కోట్ల చంద్రారెడ్డి రైతులతో కలిసి తేలిన పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఈసంవత ్సరం రైతులు రెండువిధాలుగా నష్టపోయారని ఖరీఫ్ మొదట్లో వర్షాలు లేక రైతులు రెండుసార్లు విత్తనాలు వేశారని కష్టపడి పండించిన పంట గతనాలుగు రోజులుగ కురుస్తున్న వర్షాలకు పూర్తిగా పంట మునిగిపోయి రైతులకు నష్టాలు మిగిల్చిందన్నారు. దాదాపు 600 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రైతులు శంకర్, ఈశ్వరయ్య, పెద్ద శివన్న పాల్గొన్నారు.

# స్త్రీ శక్తి పథకాన్ని ప్రారంభించిన మాజీ ఎంపీటీసీ సభ్యులు

- మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి - సీఎం చంద్రబాబునాయుడితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం
- మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆకుల వీరేష్



**దేవనకొండ, ఆగస్టు16, ప్రభాతవార్త;** మండలకేంద్రమైన దేవనకొండలో ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ ఆదేశల మేరకు బస్టాండు ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు పథకం (స్త్రీ శక్తి పథకం)ను దేవకొండ మాజీ ఎంపీటీసీ సభ్యులు ఆకుల వీరేష్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించి పథకం గురించి తెలియజేశరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా సీఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలు రాష్ట్రంలో ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. ప్రభుత్వం గుర్తించిన ఆధార్ లేదా, ఓటర్ లేదా రేషన్‌కార్డును కలిగి ఉండాలన్నారు. రైతుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. అన్నదాత, పీఎం కిసాన్ పథకాలను అమలు చేసి రైతులకు ఆర్థికంగా చేయూతనందించిందన్నారు. రాష్ట్రం అన్నివిధాలా సీఎం చంద్రబాబు నాయుడు హయాంలోనే సాధ్యపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవనకొండ గ్రామ పంచాయతీ సర్పంచ్ భర్త మాల మాల బండ్లయ్య, తెలుగు యువత నాయకులు పి.రాజాసాహెబ్, దేవనకొండ పట్టణ ఉపాధ్యక్షులు తిమ్మయ్య, జనసేన నాయకులు ఉచ్చీరప్ప, రామాంజనేయులు, బీజేపీ నాయకులు వీరయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు రాముడు, నాగేశ్వరరావు, చాంద్, గోవింద్, గంప రాజు, గొల్ల ఆనంద్, చెన్నప్ప బంగి, రంగన్న, దేవనకొండ టీడీపీ నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వినాయకచవితి వేడుకల్లో డిజెలకు అనుమతులు లేవు-సిఐ మధుసూధన్‌రావు



**వెల్దుర్తి, ఆగస్టు16, ప్రభాతవార్త :** వెల్దుర్తి సర్కిల్ కార్యాలయం ఆవరణలో శనివారం సిఐ మధుసూధన్‌రావు ఆధ్వర్యంలో వెల్దుర్తి ఎస్సై జి.అశోక్ అధ్యక్షతన శాంతి కమిటీ సమావేశం వినాయక మండపాల నిర్వాహకులు, గ్రామపెద్దలు, ఆధ్యాత్మిక వేత్తలతో కలిసి నిర్వహించారు. సిఐ మధుసూధన్‌రావు మాట్లాడుతూ వినాయక చవితి పండుగను పురస్కరించుకొని వినాయక మండపాల ఏర్పాటు మొదలుకొని నిమజ్జనం వరకు భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రజల శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా వేడుకలు జరుపుకోవాలని సూచించారు.వినాయకచవితి వేడుకల్లో డిజెలకు అనుమతులు లేవన్నారు. సాంప్రదాయ పద్ధతుల్లో మంగళవాయిద్యాలు,డ్రమ్స్‌ను ఏర్పాటుచేసుకొని ప్రశాంతంగా పండుగ జరుపుకోవాలన్నారు.ఆకతాయిలపై ప్రత్యేక పోలీస్‌నిఘా ఉంచామన్నారు. నిబంధనలు అతిక్రమించి అల్లర్లకు పాల్పడితే ఎవరిని వదిలిపెట్టమన్నారు.డ్రోన్ కెమెరాల పర్యవేక్షణ ఉంటుం దన్నారు. విగ్రహాలను సైతం ఎక్కువ ఎత్తు లేకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. శాంతియుతంగా పండుగ జరుపుకునేందుకు తమ పూర్తి సహకారం ఉంటుందని సిఐ అన్నారు. అదేవిధంగా ఎస్సై అశోక్ మాట్లాడుతూ అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ రంగులు చల్లుకొని,కోడిగుడ్లు వేసుకొని నృత్యం చేయడంతో భక్తులకు, ముఖ్యంగా మహిళలకు చాలా ఇబ్బందులు ఎదుర వుతాయ న్నారు. ఇలాంటివి మానుకొని మద్యం త్రాగకుండా యువత భక్తిశ్రద్ధలతో పండుగనను జరుపు కోవాలని ఎస్సై సూచించారు.ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహించేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటా మన్నారు. రాత్రివేళల్లో 11 గంటలు దాటితే ఎవరు వినాయక మండపాల వద్దకు వెళ్ళొన్నామని తిరగడం మంచిది కాదన్నారు.అక్కడ భక్తిపాటలతో పూజాకార్యక్రమాలు చేసుకోవా లన్నారు. యువత మంచిగా మసలుకొని లేనివారికి భక్తులకు అన్నదానం ఏర్పాటుచేయాలని సూచించారు. నిమజ్జనంరోజున చిన్నపిల్లలను హంద్రీనీవా కాలువ వద్దకు తీసుకురాకూడదన్నారు. వెల్దుర్తి సర్కిల సిఐ మధుసూధన్‌రావు,వెల్దుర్తి ఎస్సై అశోక్.ట్రైనీ ఎస్సై వి.విద్యశ్రీ , పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ పథకం విజయోత్సవ ర్యాలీ..



**ఆలూరు, ఆగస్టు16, ప్రభాతవార్త;** ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్సీ బి.టి.నాయుడు, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, వాల్మీకి కార్పొరేషన్‌చైర్మన్ బుజ్జమ్మ, రాష్ట్ర మహిళా నాయకురాలు వైకుంఠం జ్యోతి పేర్కొన్నారు. శనివారం ఆలూరు పట్టణంలో అన్నదాత సుఖీభవ పథకం విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ట్రాక్టర్ ర్యాలీ చేపడుతూ ముందుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పెట్టుబడి సాయం కింద అర్హులైన ప్రతిరైతుకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాన్ని అందించిందన్నారు. రైతులను అన్నివిధాలా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. రైతులు బాగా పంటలు పండించి ఆర్థికంగా రాణించాలని పిలుపునిచ్చారు. అలాగే స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలకు ఆగస్టు 15వ తేదీ నుంచి ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరిగిందన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా ప్రతి పథకాన్ని అమలు చేస్తూ ప్రజల మన్ననలు పొందుతోందన్నారు. ప్రజా, రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవనకొండ మండల టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్, హాలహర్వి కన్వీనర్ సుధాకర్, టీడీపీ నాయకులు తిప్పయ్య, మీనాక్షినాయుడు, హెబ్బటం విష్ణువర్ధన్‌రెడ్డి, చిన్నహ్యాట శేసగిరి, బిల్లేకల్ వెంకటేష్, కృష్ణయాదవ్, అట్టేకల్ జీవన్‌కుమార్, ముత్తుకూరు మల్లికార్జున, పాల్‌రెడ్డి, గూళ్యం ప్రకాష్, మారుతి, చౌదరి, మొలగవల్లి శీనప్ప, దేవనకొండ నుంచి మాజీ జెడ్పీటీసీ ఉచ్చీరప్ప, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, మల్లికార్జునగౌడ్, గిడ్డయ్యగౌడ్, నాగరాజుగౌడ్, మల్లేపల్లి రంగడు పాల్గొన్నారు.

## ఘనంగా ఆస్పరిలో కృష్ణాష్టమి వేడుకలు



**ఆస్పరి, ఆగష్టు 16, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఆస్పరిలో స్తానిక భమలింగేశ్వర స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని చిరుమాన్‌దొడ్డి, హాలిగేరి, జోహారాపురం గ్రామాలలో వైభవవంగా వేడుకలు నిర్వ హించారు. శనివారం ఉదయం శ్రీకృష్ణునుని ఆలయంలో స్వామివారి విగ్రహానికి జలాభిషేకం, గంగపూజ, పంచామృ తాభిషేకం, మహా మంగళహారతి తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఉట్లు ఉత్సవాలు నిర్వ హించారు. కృష్ణుని చిత్రపటాన్ని వాహానంపై కళశాలను మేళతాళా లతో గ్రామ పుర వీధుల గుండా ఊరేగింపు చేశారు. విచ్చేసిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మాజీ సోషైటి డైరెక్టర్ కృష్ణాయాదవ్, రామలింగప్ప, చెవుల ప్రకాష్‌యాదవ్, దుమ్మ వెంకట్రాముడు, దుమ్మ నరసింహులు, జనసేన మండల కన్వీనగర్ అరవింద్, చాగంటి రఘుయాదవ్, రామాంజ నేయులు, యాగంటి డాక్టర్ గిరిధర్, లక్ష్మినారాయణ, దినేష్, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

## వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



**కొత్తపల్లె, ఆగష్టు 16, ప్రభాతవార్తః** మండలంలోని కొత్తపల్లె, ఎర్రమఠం గుమ్మడాపురం, శివపురం గ్రామాల్లో కృష్ణాష్టమి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించినైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. యువకులు ఉత్సాహంగా ఉట్టికొడుతూ సందడి చేశారు. సాయంత్రం వీధుల వెంట కృష్ణుని విగ్రహాలను ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సాధన స్కూల్లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**తుగ్గలి, ఆగష్టు 16, ప్రభాతవార్త:** హిందువులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగలలో శ్రీకృష్ణాష్టమి ఒకటి. అలాంటి కృష్ణాష్టమి వేడుకలను మండల కేంద్రమైన తుగ్గలి లోని సాధన విద్యానికేతన్ ఇంగ్లీషు మీడియం పాఠ శాల కరస్పాండెంట్ దండు భాస్కర్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. చిన్నా రులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో విశేషంగా ఆకట్టుకున్నారు. ఆయన మాట్లాడుతు శ్రీమహా విష్ణువు అవతారమైన శ్రీకృష్ణుడు పుట్టిన రోజే శ్రీకృష్ణాష్టమి జయంతి వేడుకలు జరుపుకుంటా రన్నారు. హిందూ క్యాలెండర్ ప్రకారం భాద్రపదమాసం కృష్ణ పక్ష అష్టమి తిథినాడు జన్మాష్టమి వేడుకలను జరుపుకుంటారని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు ఇలాంటి సంస్కృతులు తెలిపేందుకు పండుగలు ఉపయోగపడుతాయి.పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహానంది కొలువులో పోటెత్తిన భక్తులు



**మహానంది, ఆగష్టు 16,ప్రభాతవార్తః** మహానంది పుణ్యక్షేత్రానికి భక్తులు పొటెత్తారు. వరుసగా మూడు రోజులుగా సెలువులు కావడంతో శ్రీకామేశ్వరీదేవి సమేత మహానందీశ్వరస్వామి వారి దర్శనానికి వందలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి మహానందికి చేరుకున్నారు. శనివారం తెల్లవారుజాము నుండే భక్తులు స్వామివారి దర్శనానికి ఎక్కువ సంఖ్యలో చేరుకోవడంతో ఆలయ ఈవో శ్రీనివాసరెడ్డి ఏఈవో మధు ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ శశిధర్‌రెడ్డి సుబ్బారెడ్డి, టెంపుల్‌ఇన్‌స్పెక్టర్ నాగమల్లయ్యఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అంతరాయాలు కలుగకుండా చర్యలు తీసుకున్నారు. వందల సంఖ్యలో వాహనాలుచేరుకోవడంతో ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా ఎస్ఐ రాంమోహన్‌రెడ్డి అదేశాల మేరకు పోలీసులు వెంకటరమణ, చంద్రశేఖర్, శేషన్న తదితరులు చర్యలు చేపట్టారు.

## కేడిసిసి బ్యాంక్ మేనేజర్‌కు ఉత్తమ అవార్డు

**నందికొట్కూరు, ఆగష్టు 16, ప్రభాతవార్త :**



పట్టణంలోని కేడిసిసి బ్యాంక్ మేనేజర్ కల్కి వెంకటరమణకు ఉత్తమ అవార్డును జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి గణియా చేతుల మీదుగా 79వ స్వాతంత్ర దినోత్సవం సంధర్భంగా అవార్డును అందుకున్నారు. ఈ సంధర్భంగా నంద్యాల జిల్లా రీజినల్ అధికారి శివలీల మాట్లాడుతు మేనేజర్ వెంకటరమణ బ్యాంక్ ఋణాలు వసూలు చేయడంలో నందికొట్కూరు జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఇందులో మేనేజర్‌గా అంకిత భావంతో పనిచేస్తున్నందున మంచి ఫలితాలు వచ్చాయని ఆని ఆమె అభినంధించారు.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**కొలిమిగుండ్ల, ఆగష్టు 16, ప్రభాతవార్తః** కొలిమిగుండ్ల మండల కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా స్థానిక శివాలయంలో శ్రీకృష్ణుని ప్రతిమను పెట్టి ఉదయం నుండి కొలిమిగుండ్ల మండల యాదవ సంఘ సభ్యలందరు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి జన్మదిన వేడుకల్లో కొలిమిగుండ్ల మండల టిడిపి అధ్యక్షులు మూలే రామేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మధ్యాహ్నం ప్రజలందరికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం శ్రీకృష్ణుని చిత్రపటాన్ని గ్రామంలోని పురవీధుల గుండా డప్పువాయిద్యాల మధ్య ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈకార్యక్రమం కొలిమిగుండ్ల మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించినట్లు మండలంలోని యాదవులందరు కలిసి ఐక్యమత్యంతో శ్రీకృష్ణా జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరుపుకున్నామని ఈసందర్భంగా కొలిమిగుండ్ల మండల సంఘం వారు తెలిపారు.

## వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా అంబటి రవికుమార్‌రెడ్డి

**బనగానపల్లె, ఆగష్టు 16, ప్రభాతవార్తః**



మండలంలోని బత్తులూరుపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అంబటి రవికుమార్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా పార్టీ నియమించింది. ఈసందర్భంగా శనివారం ఆయన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువకప్పి పూలదండలతో సత్కరించారు. అలాగే కేక్ కట్‌చేసి పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. ఈసందర్భంగా అంబటి రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ తనమీద నమ్మకం ఈపదవి రావడానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి, తనకు పదవి అందించిన మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో అవుకు మండల వైసీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, జిల్లా వైసీసీ యువజన విభాగం అధ్యక్షులు గుండం నాగేశ్వర్‌రెడ్డి, జిల్లా వైసీపీ ప్రచారకార్యదర్శి సిద్దంరెడ్డి రాంమోహన్‌రెడ్డి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మద్యం బాటిళ్లు స్వాధీనం

**కొత్తపల్లె, ఆగష్టు 16, ప్రభాతవార్తః** మద్యం అమ్ముతున్న ఓ వ్యక్తి నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని వ్యక్తిపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ జయశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు కొత్తపల్లె గ్రామానికి చెందిన చంద్రశేఖర్ గౌడ్ అనే వ్యక్తి గ్రామ శివారులోని రైస్ మిల్లు దగ్గర్లో మద్యం బాటిళ్లు పెట్టుకొని అమ్మకం చేస్తున్నారు. అందిన సమాచారం మేరకు దాడిచేసి అతని వద్ద నుండి 15 క్వాటర్ బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

## ఘనంగా స్వాతంత్ర్య వేడుకలు

**కర్నూలు విద్య, ఆగష్టు 16, ప్రభాతవార్తః**



కర్నూలు నగరంలోని బళ్లారి చౌరస్తా సమీపం నందు సిబిఆర్ రమేష్ హాస్పిటల్ నందు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా డాక్టర్ రమేష్ బాబు జాతీయజెండాను అవిష్కరించి తన సందేశాన్ని తెలియజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు దేశభక్తి కలిగి ఉండాలని ప్రతిఒక్కరు తమ యొక్క డ్యూటిని సక్రమంగాచేసినచో దేశం అభివృద్ది చెందుతుందన్నారు. ఈకార్యక్రమంలో రెడియాలజిస్టు డాక్టర్ శిల్ప, గైనకాలజిస్టు డాక్టర్ సుధారాణి, అప్తాల్ డాక్టర్ ప్రసన్న, అకౌంటెంట్ ఉషా కాంత్, ప్రియదర్శిని, మల్లేశ్వరి, నర్సింగ్ ఇంచార్జ్ నాగమణి, సూపర్‌వైజర్ కళ్యాణ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## మల్లన్నను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి

**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు16, ప్రభాతవార్త**



శ్రీశైల మహాపుణ్యక్షేత్రంను శనివారంనాడు ఏపి హైకోర్టు న్యాయమూర్తి చల్లా గునరంజన్ దంపతులు కుటుంబ సమేతంగా శ్రీశైలం మల్లన్న దర్శనార్థమై ఆలయం వద్దకు చేరుకున్నారు.వారికి ఆలయ రాజాగోపురం వద్ద శ్రీశైలందేవస్థానం అదికారులు,అర్చకస్వాములు సాదర స్వాగతం పలికారు.అనంతరం ఆలయప్రవేశం చేసి శ్రీస్వామిఅమ్మవార్ల ఉభయ దేవాలయాలను దర్శించుకోని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.తదుపరి అమ్మవారి ఆలయ ప్రాకార మండపంలో వేదపండింతులు వేధాశీర్వచనములు వల్లించగా,అర్చకస్వాములు తీర్ధప్రసాదములు అందజేసారు.తదుపరి ఆలయ ఈఓ ఎం.శ్రీనివాసరావు శ్రీస్వామివారి శేషవస్త్రములతో సత్కరించి లడ్డు ప్రసాదములను అందజేసారు.తదుపరి శ్రీస్వామిఅమ్మవార్ల చిత్రపటంను భహుకరించారు.

## కొత్త పంథాలో..వడ్డీ దందా..!

**(మొదటి పేజీ తరువాయి ) :** అసలు నగదుకు సమాన మవుతోంది. ఆస్తులకు హక్కులు పొ ందిన అనంతరం రూ.5నుంచి రూ.10 వరకు వడ్డీ వసూలు చేస్తున్న కొందరు వ్యాపారులు ప్రస్తుతం ఆయా ఆస్తులకు విలువలు పెరుగుతుండటంతో తిరిగి ఇచ్చేందుకు కొర్రీలు పెడుతున్నారంటూ బాధితులు వాపోతున్నారు. అలా తమ అక్రమ వడ్డీ వ్యాపారాన్ని రూ.కోట్లలో సాగిస్తున్నా వాటికి సంబంధించిన లెక్కలు మాత్రం ఎక్కడా అధికారికంగా కనిపించకుండా జాగ్రత్తలు పడుతున్నారు సదరు వ్యాపారులు. కొందరు అక్రమ వ్యాపారం చేసే వడ్డీ వ్యాపారులు ఆయా ఆస్తులకు హక్కులు పొందిన తర్వాత వాటిని బ్యాంకుల్లో పెట్టి నగదు పొంది బాధితుల డబ్బుతోనే సగం దందా నడిపిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**-గతంలో ఉక్కుపాదం..!**

గతంలో కాల్‌మనీ వ్యవహారంపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. స్పందన ఫిర్యాదు వచ్చిందే తడువుగా తనిఖీలు నిర్వహించి వారిపై చర్యలు తీసుకునేవారు. గత అధికారులు కాలంలో జిల్లా వ్యాప్తంగా వడ్డీ వ్యాపారులపై వస్తృతంగా తనిఖీలు జరపడంతో కొంతమంది వడ్డీ వ్యాపారుల నుంచి వందలకొద్దీ డాక్యుమెంట్లు, చెక్కులు, ప్రామిసరీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. దాంతో ఈ దందా కొన్ని నెలల పాటు సద్దుమణిగినా..మళ్లీ ఇటీవల వడ్డీ దందా జోరుగా సాగుతోందన్న ఆరోపణలున్నాయి. అయితే పోలీసులు చర్యలు చేపడుతున్నా కొందరు వడ్డీ వ్యాపారులు చట్టాన్ని ఆసరాగా చేసుకుని తప్పించుకు తిరుగుతున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా అసలైన బాధితులకు న్యాయం జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆస్తులు గుప్పిట్లో పెట్టుకుని తమ జీవితాలతో ఆడుకుంటున్న వడ్డీ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ ప్రజల నుంచి వినిపిస్తోంది.

## వెల్దుర్తిలో ఘనంగా శ్రీకృష్ణజయంతి వేడుకలు

**వెల్దుర్తి, ఆగస్టు16, ప్రభాతవార్త :**



మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని పశులోని దేవాలయంలో ఉన్న శ్రీ రుక్మిణీ కృష్ణ దేవాలయంలో శనివారం శ్రీకృష్ణజయంతి వేడుకల సందర్భంగా శ్రీకృష్ణ జయంతోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామి వారికి పంచామృత అభిషేకం, గో పూజ,మహ మంగళహారతితో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రామబసయ్య కుటుంబసభ్యులు పూజా కార్యక్రమాల అనంతరం శ్రీకృష్ణ జయంతోత్సవ కమిటీతో కలిసి భక్తులకు అన్నదానం ఏర్పాటుచేశారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని వారు మోసుకుంటూ రథోత్సవంపై కూర్చోబెట్టి గ్రామ పురవీధుల్లో సాంప్రాదాయ నృత్యాలు, కోలాటాలు, భక్తిగీతాలతో ఊరేగింపు చేశారు.అదేవిధంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని సేవా మండపం వద్ద కోయిలకొండ,రామళ్లకోట ఉత్సవకమిటీ సభ్యులు మురళీక్రిష్ణ, బి.రామాంజనేయులు, భక్తులు భక్తి శ్రద్ధలతో పూజా కార్యక్రమాలు,భగవద్గీత పఠనం చేశారు. ఆధ్యాత్మిక వేత్తలు లక్ష్మీరెడ్డి,రామాంజనేయులు, రాంబసయ్య కుటుంబసభ్యులు, పామయ్య, బిజెపి అధ్యక్షురాలు శాంతి, మహిళ భక్తులు చాముండేశ్వరి, విష్ణు పాల్గొన్నారు.

## నారాభువనేశ్వరి, నారాబ్రహ్మణిల చిత్రపటాలకు పాలాభిషేకం

**వెల్దుర్తి, ఆగస్టు16, ప్రభాతవార్త :**



మండలంలోని గుంటుపల్లి గ్రామంలో ఈదుల వెంకటరాముడు ఆధ్వర్యంలో మహిళలు నారాభువనేశ్వరి, నారాబ్రహ్మణిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం కింద ఏపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్,మంత్రి నారాలోకేష్‌లు మహిళలకు ఉచితబస్సులను ప్రారంభించడం ఎంతో సంతోషకర విషయమన్నారు.పత్తికొండ ఎమ్మెల్యే కెఇ శ్యాంబాబు ఆదేశాల మేరకు జిల్లా తెదేపా నాయకులు సుబ్బరాయుడు,వెల్దుర్తి సొసైటీ అధ్యక్షులు బొమ్మన రమాకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు కేక్ కట్‌చేసి పంచిపెట్టారు.ముఖ్యమంత్రి,మంత్రి సతీమణులు నారాభువనేశ్వరి,నారాబ్రహ్మణిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.సూపర్‌సిక్స్‌లో భాగంగా స్త్రీశక్తి పథకం ప్రారంభించడంతో సిఎంకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా మాజీ సీఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి జయంతి

**దేవనకొండ, ఆగస్టు16, ప్రభాతవార్త;**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి జయంతి వేడుకలను శనివారం దేవనకొండలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీయే కూటమి నాయకులు ఆకుల వీరేష్, దేవనకొండ సర్పంచ్ బత్త బండ్లయ్య, రాజాసాహెబ్, ఉచ్చీరప్పలు పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎంగా పనిచేసిన సమయంలో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేశారన్నారు. పేదల సంక్షేమానికి అహర్నిశలు పాటుపడ్డారన్నారు. కర్నూలు జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారని చెప్పారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నాగేశ్వరరావు, చాంద్‌బాషా, సుభాన్, ఈశ్వర్, రాముడు, బాలు, రవి, రంగన్న తదితరులు పాల్గొన్నారు.

## శ్రీగిరిలో శాస్త్రోక్తంగా గోపూజ

**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు16, ప్రభాతవార్త :**



శ్రీగిరి క్షేత్రంలో కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకోని దేవస్థానం శనివారంనాడు ఉదయం ఆలయ ప్రాంగణంలోని శ్రీగోకులంలో గోపూజను నిర్వహించడం జరిగింది.ఈ గోపూజ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాదికారి ఎం.శ్రీనివాసరావు దంపతులు,అర్చకులు వేదపండితులు తదితరులు పాల్గొన్నారు. కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకోని నిత్యసేవతో పాటు విశేషంగా గోపూజ జరిపించబడింది. శాస్త్రోక్తంగా జరుపబడిన ఈ గోపూజలో ముందుగా ఆలయప్రాంగణంలోని శ్రీ గోకులంలో గోవులకు, గోవత్సాలకు (ఆవుదూడలకు) పూజాదికాలు జరిపించబడ్డాయి.ఈ విశేష కార్యక్రమంలో ముందుగా లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు,వేదపండితులు పూజసంకల్పాన్ని పఠించారు.ఈ సంకల్పంలో సకాలంలో తగినంత వర్షాలు కురిసి,పంటలు బాగా పండాలని,అతివృష్టి,అనావృష్టి నివారించబడాలని, పాడిపంటలతో దేశం,రాష్ట్రం సుబిక్షంగా ఉండాలని,అగ్నిప్రమాదాలు,వాహన ప్రమాదాలు, మొదలైనవి నిరోధించబడాలని, అందరికి శ్రేయస్సు కలగాలని చెప్పబడింది.పూజాదికాలు నిర్విఘ్నంగా జరిగేందుకుగాను ముందుగా మహగణపతిపూజ జరిపించబడింది.

## ఘనంగా శ్రీకృష్ణాష్టమి జన్మదిన వేడుకలు

**కోవెలకుంట్ల, ఆగస్టు 16, ప్రభాతవార్త :**



కోవెలకుంట్ల పట్టణంలో కృష్ణాష్టిమి వేడుకలు త్రైత సిద్ధాంతంప్రబోదిందూ జ్ఞాన వేదిక సేవా సమితి అద్యక్షులు డాక్టరు యు. జనార్దన్ దంపతులు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు.శ్రీమహావిష్ణువు శ్రీకృష్ణుడుగా శ్రావనమాసములో ఏనిమిదవ నెల ఎనిదవ రోజున శ్రీకృష్ణుడుగా అష్టిమి రోజున జన్మించిన ఈ అష్టిమికి ఎంతో ప్రాదాన్యత సంచరించుకుంది. సహజంగా అష్టిమి రోజున ఏ శభకార్యాయము నిర్వహించరు అయితే ఈ అస్టిమి రోజు సాక్షత్తు శ్రీమహా విష్ణువు శ్రీకృష్ణుడుగా ఏనివద అవతారములో ఏనివదిన జన్మించగా ఈ అష్టిమిక ఎంతో ప్రాదాన్యము ఏర్పడింది, కోవెలకుంట్ల పట్టణంలోని జిసిఅర్ కాంప్లెక్సు అవరణములో త్రైతసిద్దాంత కర్త ప్రబోనంద స్వామి శిష్యుల సారథ్యంలో శ్రీకృష్ణాష్టిమి వేడుకలు శనివారము ఉదయం ప్రారంబించారు ఈవేడుకలుకు పట్టణంలో పెద్ద సంఖ్యంలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.ఈ వేడుకలు ఈనెల 16వ తేది వరకుయనిర్వహించడము జరుగుతుందని డాక్టరు జనార్దన్ చెప్పారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం..!

**- పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తాం - ఘనంగా ఉపాధ్యాయులను సన్మానం**



**వెలుగోడు, ఆగస్టు 16, ప్రభాతవార్త :** వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1998-99 విద్యా సంవత్సరం చదువుకున్న పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చదువుకున్న విద్యార్థులు దూర ప్రాంతాలను, రాష్ట్రాలనుంచి హాజరైయ్యారు. తమ విద్యాబుద్ధులు నేర్పిన గురువులను స్థానిక ప్రధాన సెంటర్ నుండి భాజా భజంత్రీలతో, మేళా తాళలతో . బాణాసంచ కాల్చుతూ , పూలు చల్లుతూ ఘనంగా అహ్వానం పలికారు. పాఠశాలకు చేరుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు సరస్వతీ పూజ నిర్వహించి గురువులతో జ్యోతి ప్రజ్వలన చేయించారు. వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల యందు చదువు నేర్పిన గురువు, చదువుకున్న విద్యార్థులు స్వర్గీయులైన వారి ఆత్మ శాంతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ పాఠశాల యందు చేసిన చిలిపి పనులు, గురువులతో మెలిగిన విషయాలను గుర్తు చేసుకుంటూ అనందంగా సంతోషాన్ని పంచుకున్నారు. అందరు చదువుకున్న తరగతి గదుల్లో తిరిగి ఎక్కడ కూర్చోని చదువుకున్న రోజుల్లో చేసిన అల్లర్లను గుర్తు చేసుకుంటూ అనందంగా గడిపారు. మధ్యాహ్నా భోజన కార్యక్రమ అనంతరం పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ మమ్మల్ని క్రమశిక్షణతో విద్యాబుద్ధులు చెప్పి ప్రయోజకులుగా చేసిన గురువులను ఎప్పటికి మరువలేమన్నారు. చదువుకున్న పాఠశాల అభివృద్ధికి, పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం తమవంతు కృషి చేస్తామన్నారు. అనంతరం విశ్రాంత ఉపాధ్యాయులు హుసేన్, శివకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, ఉర్దూ ముస్సి గని, రాబర్ట్, రవీంద్రుడు, మహమ్మద్ ఇక్బాల్‌లు, మండల విద్యాధికారి బ్రహ్మంనాయక్, ఉపాధ్యాయులు వెంకటరామిరెడ్డి,రొడ్డా శ్రీకాంత్‌రెడ్డి, అక్బర్, మోమిన్ వలి, అబ్దుల్ అజీస్, రవిశంకర శర్మ, మహమ్మద్ రఫీ, ఎండీ షఫీ, సుల్తాన్ మోహిద్దీన్, మొయినుద్దీన్‌లను శాలువ కప్పి, పూలమాల వేసి మెమొంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం కమిటీ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వకీల్ అహమ్మద్, ఫరూక్, ఇంతియాజ్, మగ్బుల్ భాష, ఫజులుల్లా, ముబీనా, రామకృష్ణ, సానా లక్ష్మీదేవి, లింగేశ్వర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రజాచైతన్యయాత్రను జయప్రదం చేయాలి

**: నేడు వినుకొండలో గిరిజనుల రౌండ్ టేబుల్ సమావేశ**
**: గిరిజనులకు పిలుపునిచ్చిన ఎపి గిరిజన ప్రజాసమాఖ్య రాష్ట్రఅధ్యక్షులు రాజునాయక్**



**నంద్యాల, ఆగస్టు 16, ప్రభాతవార్త :** వినుకొండ పట్టణంలో ఆదివారం జరిగే ప్రజాచైతన్యయాత్రను జయప్రదం చేయాలనిఎపి గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రాజునాయక్ గిరిజనులకు పిలుపునిచ్చారు. శనివారం నంద్యాల జిపిఎస్ కార్యాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ ఎస్‌టిల హక్కులు సాధించుకునేందుకు చైతన్యయాత్రలో భాగంగా వినుకొండలో రౌండ్‌టేబుల్‌సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 79 సంవత్సరాలు గడిచిన గిరిజనులు ఏమాత్రం మార్పు చెందలేదన్నారు. మన దేశ సంస్కృతిని, నాగరికతను కాపడుకుంటూ ఆ మహోన్నత సాంప్రదాయాల ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటుతున్నది ఏకైక గిరిజన జాతి అన్నారు. గిరిజన హక్కులను కాపాడుకునేందుకు, మన జాతి మనుగడ పెంచేందుకు అందరు సంఘటితం కావడానికి మేధావులతో అభిప్రాయసేకరణ, భవిష్యత్ కార్యాచరణ కొరకై దిశానిర్దేశ గురించి చర్చించేందుకు ఆదివారం ఉదయం వినుకొండపట్టణ జాషువా కళా ప్రాంగణం నందు సంఘాలకు అతీతంగా గిరిజన సంఘ నేతలు, మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశానికి ప్రతి గిరిజనుడు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలో ఉన్నమేదావులు, ముఖ్యనేతలు, వివిధ సంఘాలనాయకులు హాజరవుతున్నారన్నారు. రౌండ్‌టేబుల్ సమావేశానికి వందలాదిమంది వచ్చి జయప్రదం చేయాలని రాజునాయక్ కోరుతున్నారు.

## శిల్ప కలలకు ఆద్యుడు దురగడ్డ బాలవీరాచారి



**ఆళ్లగడ్డ, ఆగస్టు 16, ప్రభాతవార్త:** ఆళ్లగడ్డలో శిల్ప కలలకు ప్రాణం పోసిన ఆద్యుడు కీ.శే.దురగడ్డ బాల వీరాచారి అని ఆయన కుమారుడు దురగడ్డ హరిప్రసాద్ ఆచారి పేర్కొన్నారు. శనివారం ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీశారదా శిల్పకళా మందిరం అవరణలో శిల్పి దురగడ్డ బాలవీరాచారి 99వ జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈసందర్భంగా దురగడ్డ హరిప్రసాద్ ఆచారి మాట్లాడుతూ గుంప్రమానిదిన్నె గ్రామానికి చెందిన తమ తండ్రి బాలవీరాచారి 1970వ సంవత్సరంలో ఆళ్లగడ్డలో శిల్పకళలకు ప్రాణం పోసి శిల్పకల అభివృద్ధికి విశేష కృషిచేశారని తెలిపారు. ఆయన ఫలితంగా ఈరోజు దేశ విదేశాల్లో ఆళ్లగడ్డ శిల్పకళ ఎంతో ప్రసిద్ధి చెందాయని తెలిపారు. శ్రీశారదా శిల్పకళా మందిరం వ్యవస్థాపకులు దురగడ్డ రవీంద్రచారి మాట్లాడుతూ తమ తండ్రి బాలవీరాచారి అభినవ జక్కానచార్యులని కొనియాడారు. ప్రొఫెసర్ ఆదినారాయణ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గంగన్న, రామాచారి, శిల్పులు పాల్గొన్నారు.

## అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

**- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దుచేయాలి - సిఐటియు**



**పాములపాడు రూరల్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** అసంఘటిత కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వ్యవస్థను రద్దుచేయాలని కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరణ చేయడం మానుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు యేసురత్నం డిమాండ్ చేశారు. పాములపాడు మండలంలో సిఐటియు కార్యాలయం నందు సిఐటియు మండల మహాసభ నిర్వహించారు. ఈసందర్భంగా యేసు రత్నం మాట్లాడుతూ సిఐటియు 1970 సంవత్సరంలో ఏర్పడిందని నాటి నుండి నేటి వరకు కార్మికుల కోసం పోరాటం చేసి ఎన్నో కార్మిక చట్టాలను సాధించిందన్నారు. 1991లో నూతన ఆర్థిక విధానాల వల్ల పెన్షన్ విధానాన్ని తొలగించిందని దానిని మరలా పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జూలై 9న జరిగిన కార్మిక సమ్మెతో దేశంలో కార్మికుల ఐక్యత చాటిందన్నారు. కార్మికుల వ్యతిరేకమైన నాలుగు లెబర్ కోడ్‌లను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్నికొనసాగించాలన్నారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగ విషయాల్లో రాజకీయ జోక్యం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం సిఐటియు మండల నూతన కమిటీనీ ఎన్నుకున్నారు. నూతన మండల అధ్యక్షునిగా బి శివలక్ష్మీ, మండల కార్యదర్శి మేకల రాజు, ఉపాధ్యక్షులుగా తిరుపతయ్య, సహాయ కార్యదర్శిగా వెంగమ్మ, కమిటీ సభ్యులుగా మౌలాలి, రమణ, నాగశేషులు, అన్వర్, సురేష్, నాగమణి తదితరులను ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, కౌలురైతు సంఘం జిల్లా నాయకులు స్వామన్న, వివిధ రంగాల నుంచి కార్మికులు పాల్గొన్నారు.

## ఉర్దూ వ్యాసరచన పోటీల్లో జిల్లాకే టాపర్ గా నిలిచిన హోళగుంద విద్యార్థిని



**హోళగుంద, ఆగస్టు 16, ప్రభాతవార్త :** ఉర్దూ వ్యాసరచన పోటీల్లో జిల్లాకే టాపర్ గా నిల్చిందని జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కబీర్ సాబ్ తండ్రి ఫయాజ్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ కూలీ కార్మికుని కూతురు జిల్లాకే ఫస్ట్ రావడం సంతోషించదగ్గ విషయం అన్నారు. హోళగుంద జడ్.పి.హెచ్.ఎస్ ఉర్దూ స్కూల్ లో పదవ తరగతి విద్యార్థి ఎం కుబ్రా అనే కూలీ కార్మికుని కూతురు ఎం ఫయాజ్ కూతురు స్వతంత్ర దినోత్సవ సందర్భంగా స్వతంత్ర ఉద్యమంలో ఉర్దూ భాష పాత్ర గురించి జిల్లాల్లో 13 స్కూల్లలో ఈ వ్యాసరచన పోటీలు పెట్టడం జరిగిందని ఈ వ్యాసరచన పోటీల్లో జడ్పీహెచ్ఎస్ స్కూల్ హోళగుంద ఎం కుబ్రా విద్యార్థి జిల్లాకే ఫస్ట్ రావడం సంతోషించకు తగ్గ విషయమని టీచర్లు మరియు కుటుంబ సభ్యులు అభినందించడం జరిగిందన్నారు. కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ హజ్ కమిటీ డైరెక్టర్ డిఎండబ్ల్యూ ఆఫీసర్ సబియా పర్వీన్ సాహెబా చేతుల మీదుగా మెమోరండం ప్రశంసా పత్రం అందించడం జరిగిందన్నారు.

## ఘనంగా జనార్దనస్వామి, అంజనేయ స్వాముల జీవనోద్ధరణ విగ్రహ ప్రతిష్ట

**కోవెలకుంట్ల, ఆగస్టు 16, ప్రభాతవార్త :**



మండల పరిదిలోని సొదరదిన్నె గ్రామంలో జనార్దనస్వామి, అంజనేయ స్వాములు జీవనోద్ధరణ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమము ఘనంగా నిర్వహించగా ఈకార్యక్రమములో రాష్ట్ర రోడ్డు భవనిలు పెట్టుబడులు, మౌళిక వసతులు శాఖ మంత్రి బిసి జనార్ధనరెడ్డి సతీమని బిసి ఇందిరమ్మ పాల్గొని పూజలు నిర్వహించారు. కోవెలకుంట్ల మండలంలోని సొదరదిన్నె గ్రామంలో జనార్దనస్వామి, అంజనేయ స్వాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమము గ్రామస్తులసారథ్యంలో నిర్వహించగా ఈకార్యక్రమానికి మంత్రి బిసిజనారన్ధరెడ్డి సతీమని బిసి ఇందరమ్మ హాజరు కావడముతో అయనకు ఘనస్వాగతము పలికారు. అనంతనము అలయ అర్చకులు పూర్ణకుంబాబిషేకముతో స్వాగతము పలికారు. ఈకార్యక్రమ తెలుగు దేశం నాయకులు సుబ్బారెడ్డి గ్రామ నాయకులు విష్ణుకాంత్‌రెడ్డియ శ్రీనివాసరెడ్డి, రవికుమారురెడ్డి నాగిరెడ్డి శివారెడ్డి కోట్ల నాగేశ్వరరెడ్డి గుండం వెంకటసుబ్బారెడ్డి గుదేటి హరీస్‌రెడ్డి పేరిశెట్టిహరికృష్ణ, బీమిరెడ్డి ప్రతాపరెడ్డి వెలగటూరు సర్పంచు యల్‌విసుదాకరరెడ్డిలు పాల్గొన్నారు.

## ఘనంగా కోట్ల జయంతి వేడుకలు

**- మచ్చలేని మహానేతకు శ్రేణుల నిరాజనాలు**



**కోడుమూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త :** దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి 105వ జయంతి వేడుకలు శనివారం కోడుమూరులో ఘనంగా జరిగాయి. ముందుగా స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ భాగ్యరత్న ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు పంచాయతీ పాలకవర్గంతో పాటు టీడీపీ శ్రేణులు,కోట్ల అభిమానులు,శ్రోయోభిలాషులు,సన్నిహితులంతా భారీగా తరలొచ్చారు. అనంతరం పెద్దాయన కోట్ల విజయభాస్కరరెడ్డి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఆ తరువాత కోట్ల అభిమానులంతా పట్టణ పురవీధుల గుండా కోట్ల సర్కల్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో కోట్ల నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. టీడీపీ శ్రేణులు కోట్ల విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. శ్రేణులంతా కోట్ల అమర్ రహే అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. కోట్ల రాజకీయ జీవితంలో మచ్చలేని మహనేతకు ఎదిగిన ఆ మహనీయుని ఆదర్శ మార్గాల బాటలో మనమంతా నడుద్దామన్నారు. దేశ రాజకీయాలల్లో ఎంతో కీర్తి ప్రతిష్టతలను తీసుకొచ్చిన ఆ నేత గుర్తుగా కర్నూలు జిల్లాను కోట్ల జిల్లాగా మార్చాలని ముకుమ్మడిగా కూటమి ప్రభుత్వాన్ని కోరారు. తెలుగుదేశం పార్టీ సినియర్ నాయకులు కె.హేమాద్రిరెడ్డి, కె.యి రాంబాబు, సి.బి లత, కె.మధుసూదన్‌రెడ్డి,శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఎద్దుల మహేశ్వరరెడ్డి,ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంద్రయ్య,గుంతకంటి వేణుగోపాల్‌రెడ్డి,ఇ.రామోహన్ గౌడ్,నాగభూషణ్‌రెడ్డి,టెలిఫోన్ రాముడు, తిరుమలనాయుడు,లింగం లక్ష్మయ్యశెట్టి, పెనుమాడ రాజశేఖర్,అయ్యప్ప స్వామి ఆలయ కమిటి చైర్మన్ నల్లబోలు భాస్కరరెడ్డి, వీరేష్, ఉస్సేన్,వెంకటస్వామి ఆచారి, మురళీ, సాయిరాజేంద్ర, ఆదిశేషులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జన ఏర్పాట్లును పరిశీలించిన ఉత్సవ కమిటీ సభ్యులు

**: భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తాం : కైప చెరువు నందు గణనాథుల నిమజ్జన కార్యక్రమంమంత్రి బీసీ ఆదేశాలతో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు శీనయ్య సిఐ మంజునాథరెడ్డిలు కలిసి పరిశీలన**



**బనగానపల్లె రూరల్, ఆగస్టు 16, ప్రభాతవార్త:** గణనాథులను నిమజ్జనం చేసేందుకు, తగు ఏర్పాట్లను గణేష్ ఉత్సవ కమిటీ గౌరవ సలహాదారులు, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు, టీడీపీ నంద్యాల పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, అధ్యక్షులు మల్లారెడ్డి, నిమజ్జన ఘాట్ ఇన్చార్జి నాగేష్ బాబు, బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథ రెడ్డి లతో కలిసి పరిశీలించారు. ఈనెల 31వ తేదీన గణేష్ నిమజ్జనం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. ఈ మేరకు మండలంలోని కైప గ్రామ సమీపంలోని చెరువు నందు గణనాథులను నిమజ్జనం చేయడం జరుగుతుందని కమిటీ వారు నిర్ణయించడం జరిగింది. టంగుటూరి శీనయ్య కుల మతాలకు అతీతంగా బనగానపల్లె పట్టణంలోని గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని గణేష్ ఉత్సవ కేంద్ర కమిటీ గౌరవ సలహాదారులు టంగుటూరి శీనయ్య పేర్కొన్నారు. ఇప్పటికే గణేష్ ఉత్సవ కమిటీకి మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సొంత నిధులతో రు..50, వేల రూపాయలు ఇవ్వడం జరిగింది. గత సంవత్సరం జరిగిన నిమజ్జన కార్యక్రమంలో ముస్లిం సోదరులు మజ్జిగ పంపిణీ తో పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగిందని శీనయ్య గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టీచర్ నాగరాజు, సీనియర్ న్యాయవాది నాగేంద్రారెడ్డి, బండి వెంకటేష్, ఖాదర్, షాషా వలీ, యాగంటి పల్లె రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

## గూడూరులో ఘనంగా కోట్ల జయంతి వేడుకలు



**గూడూరు,ఆగస్టు 16, ప్రభాతవార్త :** దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి 105వ జయంతి వేడుకలు శనివారం గూడూరులో ఘనంగా జరుపుకున్నారు. ముందుగా పెద్దాయన చిత్ర పటానికి మూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. టీడీపీ శ్రేణులు,కోట్ల అభిమానులు పెద్ద ఎత్తున కోట్ల నాయ కత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు.శ్రేణులు కోట్ల హయంలో సాగిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తు చేసుకున్నారు. కాగా త్వరలో జరగనున్న జిల్లా పునర్విజనల్లో కర్నూలు జిల్లాను కోట్ల విజయభాస్కరరెడ్డి జిల్లాగా మార్చాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు.టీడీపీ నాయకులు చరణ్ కుమార్, చెట్టుకింద సురేష్, అయ్యవారి నాయుడు, నారాయణ, మధు, నాగరాజు, మూలగేరి లక్ష్మన్న,వి.బి కిశోర్,వసంత,గుంటు రంగడు, బెతపల్లి మధు, హమాలి మునెప్ప, యూత్ సభ్యులు సురేంద్ర, చిన్న పాల్గొన్నారు.

## మహిళలు తప్పనిసరిగా గుర్తింపుకార్డును చూపించాలి

**- డిపో మేనేజర్ మహమ్మద్‌రఫిక్**



**ఆదోనిలీగల్, ఆగస్టు16, ప్రభాతవార్త;** స్త్రీ శక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలు తప్పనిసరిగా ఒరిజినల్ ఆధార్‌కార్డు లేదా రేషన్ కార్డు లేదా ఓటర్ గుర్తింపు కార్డు గానీ చూపించాల్సి ఉంటుందని ఆదోని డిపో మేనేజర్ మహమ్మద్‌రఫిక్ సూచించారు. శనివారం ఆయన స్థానిక డిపోలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అర్హులైన ప్రతి మహిళకు స్త్రీ శక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ఉంటుందన్నారు. తప్పనిసరిగా మహిళలు ఒరిజినల్ గుర్తింపుకార్డును వెంట తెచ్చుకోవాలన్నారు. ఒరిజినల్ గుర్తింపుకార్డును చూపిస్తేనే ఉచితంగా ప్రయాణించవచ్చున్నారు. లేనిపక్షంలో ఉచిత బస్సు ప్రయాణానికి అనుమతించబోమన్నారు. స్త్రీ శక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గోనెగండ్లలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**గోనెగండ్ల, ఆగస్టు 16, ప్రభాతవార్త :**



మండల కేంద్రమైన గోనెగండ్లతో పాటు మండల పరిధిలోని పలు గ్రామాల్లో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి.శ్రీకృష్ణ జన్మదినం సందర్భంగా గోనెగండ్లలో ఉదయం స్వామివారికి తుంగభద్ర జలయంతో అభిషేకం నిర్వహించారు. అనంతరం తులసీ అర్చన, నవగ్రహపూజ, క్షీరాభిషేకం, మహామంగళహారతీ నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహంను పురవీదుల గుండా ఊరేగించారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించారు.మండల కేంద్రమైన గోనెగండ్లలో చిన్నారులు శ్రీకృష్ణ వేశాధారణ ఎంతో ఆకట్టుకుంది.ఆపూజ కార్యక్రమంలో ఆఖిలభారత యాదవ సంఘం మండల నాయకులు లక్ష్మినారాయణ యాదవ్, రంగస్వామియాదవ్, బావిగడ్డ పెద్ద ఈరన్న యాదవ్, నాగన్నయాదవ్, కొత్తిరాళ్ల చిన్న ఈరన్న యాదవ్ ఆధ్వర్యంలో జరిగింది.

**:-పెద్దనేలటూరులో:-**

గోనెగండ్ల మండల పరిధిలోని పెద్దనేలటూరు గ్రామంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు భక్తులు శనివారం ఘనంగా జరుపుకున్నారు.తుంగభద్రజలంతో అభిషేకం మహామంగళహారతి కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.సాయంత్రం 5 గంటలకు ఉట్టికొట్టు కార్యక్రమం జరిగింది.అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీదుల్లో అంగరంగవైభవంగా ఊరేగించారు. చిన్నారులు వేసిన కోలాటం ప్రజలను ఎంతో ఆకట్టుకుంది.ఈ కార్య క్రమానికి గ్రామ పెద్దలు రాముడు యాదవ్, మాజీ ఎంపీటీసీ కృష్ణ, ఎర్రన్న, లక్ష్మన్న, రంగన్న, వీరకృష్ణ, శివ, రామన్న, లింగన్న, గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో హజరయ్యారు. సాయంత్రం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



**చాగలమర్రి, ఆగస్టు 16, ప్రభాతవార్త :** చాగలమర్రి పట్టణంలోని శివరామానంద ఆశ్రమంలోని శ్రీకృష్ణుడి ఆలయంలో శ్రీకృష్ణాష్టమివేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా భారతి విద్యామందిరం విద్యార్థుల శ్రీకృష్ణుడి గోపికల వేషధారణతో కోలాటం విశేషం ఆకట్టుకుంది. అనంతరం ఎస్ఐ సురేష్ ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. సల్లానాగరాజుయాదవ్,వేణుగోపాల్‌రెడ్డి, గుత్తినరసింహులు, రామతీర్థం, శివశంకర్, శేషాద్రి, దస్తగిరి, మురళి, బద్రి, వెంకటేశ్వర్లు, టిఎస్ఎల్.పుల్లయ్య, కసినేనిఓబులేసు, వెంకటరమణ, సురేషప్ప, శ్రీనివాసులు,సురేంద్ర, పాల్గొన్నారు.

## శ్రీకృష్ణుని ధ్యానిస్తే సర్వపాపాలు తొలగుతాయి



**రుద్రవరం, ఆగస్టు 16, ప్రభాతవార్త :** శ్రీకృష్ణపరమాత్ముని ధ్యానిస్తే సర్వపాపాలు తొలగుతాయని అహోబిలం ఇస్కాన్ ప్రాజెక్టు ఇంచార్జి చంద్రకేశవదాస్ తెలిపారు. శనివారం శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఇస్కాన్ మందిరంలో పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అహోబిలం ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను హరినగరం గ్రామ సమీపంలో ఉన్న ఇస్కాన్ మందిరంలో అంగరంగవైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అహోబిలం ఇస్కాన్‌ప్రాజెక్టు ఇంచార్జి చంద్రకేశవదాస్ మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి వేడుకల సందర్భంగా సాయంత్రం 4గంటలకు గ్రామాల నుంచి వచ్చిన యువకులకు ఉట్టికొట్టే కార్యక్రమాన్ని నిర్వహించి బహుమతులు అందజేశామన్నారు. సాయంత్రం పదివేలమందికి అన్నప్రసాద వితరణ, హారతి, భజన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ శిరువెళ్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దస్తగిరిబాబు, రుద్రవరం ఎస్ఐ మహమ్మద్‌రఫీల ఆధ్వర్యంలో సిబ్బంది శాంతిభద్రతలను పర్యవేక్షించారు.అలాగే నెల్లూరు విజయ మ్యూజికల్‌స డ్యాన్స్ అకాడమివారిచే సాంస్కృతిక కార్యక్రమాలు, సత్యమ్మతల్లి చెక్కభజన ప్రదర్శన, 108రకాల మహానివేదన, మహాహారతీ, జన్మాష్టమి మహాప్రసాద వితరణ కార్యక్రమాలు జరిపారు. ఆదివారం వైష్ణవ కీర్తిభజనలు, శ్రీల ప్రభుపాదఅభిషేకం, వ్యాసపూజ, ప్రవచనం, మధ్యాహ్నం హారతి, వంటకాల నివేదన, సాయంత్రం నందోత్సవం విందుభోజనం ఉంటుందన్నారు. భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరుతున్నారు.



## అనారోగ్యంతో ఫోటో గ్రాఫర్ మృతి

**- బాధితా కుటుంబాన్ని పరామర్శించిన కౌతాళం సింగిల్ విండో చైర్మన్, డైరెక్టర్**



**కౌతాళంరూరల్, ఆగస్టు16, ప్రభాతవార్త;** కౌతాళం పట్టణంలోని శివప్పనగర్‌లో ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తున్న ఎహుమంతు(చంటి) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న కౌతాళం సింగిల్ విండో చైర్మన్ అల్లూరి వెంకటపతిరాజు, సొసైటీ డైరెక్టర్ కురువ వీరేష్‌లు బాధితా కుటుంబాన్ని పరామర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధితా కుటుంబ సభ్యులకు హనుమంతు అంత్యక్రియల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ మాట్లాడుతూ ఫోటోగ్రాఫర్‌గా పనిచేస్తూ జీవిస్తున్న హనుమంతు అకాల మరణం బాధాకరమన్నారు. బాధితా కుటుంబానికి అండగా ఉంటామన్నారు. నివాళులు అర్పించిన వారిలో టీడీపీ కౌతాళం పట్టణ నాయకులు డా.రాజానంద్, గిరి, ముక్కన్న, లింగేష్, కాకం రామాంజనేయులు, నరసప్ప, రమేష్, గురు తదితరులు పాల్గొన్నారు.

## ఉరుకుంద లక్ష్మినరసింహస్వామి వారిని దర్శించుకున్న మాజీ చైర్మన్

**- స్వామివారికి 1 కేజీ 200 గ్రాముల వెండి చెంబులు విరాళంగా అందజేత**



**కౌతాళం, ఆగస్టు16, ప్రభాతవార్త;** రాష్ట్రంలోని ప్రసిద్ధగాంచిన ఉరుకుంద లక్ష్మినరసింహస్వామి (ఉరుకుంద ఈరన్నస్వామి) వారిని శనివారం దేవస్థానం మాజీ చైర్మన్ చెన్నబసప్ప, వారి కుటుంబ సభ్యులు దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారికి 1 కేజీ 200 గ్రాముల వెండి చెంబులను మాజీ చైర్మన్, కుటుంబ సభ్యులు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ చెన్నబసప్ప మాట్లాడుతూ ఉరుకుంద ఈరన్నస్వామి వారి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన డిప్యూటీ కమిషనర్ వాణి, పర్యవేక్షకులు, అర్చక సిబ్బంది ఉన్నారు.

## రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలి

**: సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న**



**పెద్దకడబూరు, ఆగస్టు 16, ప్రభాతవార్త :** గత 25 రోజుల నుండి రైతులకు యూరియా దొరకక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని సిపిఎం మండల కార్య దర్శి తిక్కన్న సంబంధిత అధికారులను డిమాండ్ చేస్తున్నట్లు శనివారం పత్రిక ప్రకటనలో విలేకరులకు తెలిపారు. మండలంలో గత కొన్ని రోజులుగా సొసైటీల ద్వారా రైతులకు యూరియా అందించేవారని ఇప్పుడు ఆర్ బి కే కేంద్రాల ద్వారా రైతులకు యూరియా అందిస్తామని చెప్పిన వ్యవసాయ అధికారులు యూరియా ఎక్కడ దొరకక రైతుల అవస్థలు పడుతున్నారని విమర్శించారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రైతులకు సరిపడే యూరియాను వెంటనే అందుబాటులో ఉంచాలని లేనిపక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

## శ్రీపతిరావుపేట గ్రామంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**: అంగరంగ వైభవంగా శ్రీ కృష్ణాష్టమి : శ్రీకృష్ణుని వేషదారణలో అలరించిన చిన్నారులు**



**ఆత్మకూరు, ఆగస్టు16, ప్రభాతవార్త :** శ్రీ కృష్ణాష్టమి పర్వదిన సందర్భంగా శనివారం పట్టణంలోని గొల్లపేట, మండల పరిధిలోని శ్రీపతిరావుపేట గ్రామంలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. అంగరంగ వైభవంగా యాదవులు, గ్రామస్తులు, యువత పెద్ద ఎత్తున్న పాల్గొని ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు. శ్రీకృష్ణుని వేషాదారణలో చిన్నారులు పలువురిని అలరించారు. గ్రామంలో స్వామివారిని ఊరేగింపుగా అడుగడుగునా ప్రత్యేక పూజలు భక్తాదులు నిర్వహించారు. ఈ వేడుకలో గ్రామంలోని ప్రజలు, యువత, మహిళలు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అటవీశాఖ ఉద్యోగులకు ఉత్తమ ఆవార్డు

**: 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పర్యావరణం, వన్యప్రానులపై ఉత్తమ సేవలు**
**: పెద్దనంతాపురం ఎఫ్ఎస్ఓ మధుబాబుకు ఉత్తమ పురస్కారం**
**: ఆత్మకూరు వన్యప్రాని అటవీ డివిజన్‌లో నలుగురికి ఉత్తమ ఆవార్డులు**

**ఆత్మకూరు, ఆగస్టు16, ప్రభాతవార్త :**



పర్యావరణ వన్యప్రానుల సంరక్షణ అడవి సంపదను కాపాడుతూ విధి నిర్వహణలో అలసత్వం నిర్వహించకుండా ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తూ 24గంటలు విధి నిర్వహణలో ఉన్న అటవీశాఖ ఉద్యోగులకు 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి ఘనియా, రాష్ట్ర మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి చేతుల మీదుగా బైర్లూటి రేంజర్ కృష్ణప్రసాద్, వెటర్నరి వైద్యులు జుబేర్, వెస్లీ, పీరా అటవీశాఖ ఉదోగ్యులకు ఆత్మకూరు వన్యప్రాని డిప్యూటి డైరెక్టర్ సహాకారంతో ఉత్తమ పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆత్మకూరు వన్యప్రాని అటవీ డివిజన్ పరిధిలోని పెద్దపులుల అభయారణ్యంలో వన్యప్రానుల సంరక్షణ చేస్తూ పర్యావరణం పరిరక్షణకై పాటుపడుతున్న ఉద్యోగులకు ఉత్తమ ఆవార్డులు అందించడం హార్షించదగ విషయమని పలువురు అటవీశాఖ ఉదోగ్యగులు చర్చించుకుంటున్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా ఉత్తమ ఆవార్డులు అందించిన జిల్లా కలెక్టర్ రాజాకుమారి ఘణియా, మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డిలకు అటవీశాఖ ఉద్యోగుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పరవళ్లతో.. శ్రీశైలం జలాశయం..!



**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు16, ప్రభాతవార్త**

శ్రీశైలం రిజర్వయర్‌కు బారిగా వరద నీరు వచ్చిచేరుతుండడంతో పరవళ్లతో తొనికిసు లాడుతుంది. వరద ఉధృతికి గంగమ్మ జలకళను సంతరించుకుంది. కృష్ణమ్మ గలగలతో సెలవేటి దారలతో సాగిపోతుంది. వరద ప్రవాహం పెరగడంతో జలశయం క్రస్ట్‌గేట్ల సంఖ్యాను 5 రెడియల్ క్రస్ట్‌గేట్లను తేరచి ఇంజనీర్లు నీటిని దిగువ సాగర్‌కు విడుదల చేయడం జరుగుతుంది. ఈక్రమంలోనే ఒక్కోక్క గేటు 10 అడుగుల ఎత్తుమేరకు తేరచి స్పిల్‌వే గుండా 1,33,720 క్యూసెక్యు తీటిని దిగువకు సాగనంపుతున్నారు. కాగా శ్రీశైలం జలశయం నీటిమట్టం శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 882.10 అడుగులుగా ఉండగా నీటినిల్వ సామర్థ్యం 199.7354 టియంసిల నీరు నిల్వగా ఉంది. ఎగువ పరివాహక ప్రాంతాలైన జూరాల స్పిల్‌వే గుండా 41,112 క్యూసెక్యుల నీరు, విధ్యుత్ ఉత్పత్తి గుండా 38,879 క్యూసెక్యుల నీరు, సుంకేసుల నుండి 30,653 క్యూసెక్యు ల నీరు, మొత్తం 1,89,169 క్యూసెక్యుల నీరు శ్రీశైలం డ్యాంకు ఇన్‌ప్లోగా వచ్చిచేరుతుంది. ఈక్రమంలోనే శ్రీశైలం కుడిగట్టు విధ్యుత్ కే ంద్రంలో ఉత్పత్తి అనంతరం 30,509 క్యూసెక్యుల నీరు, ఎడమగట్టు విధ్యుత్ కేంద్రంలో ఉత్పత్తి అనంతరం 35,315 క్యూసెక్యుల నీరు విడుదల అవుతుంది. వరద ఉధృతి ప్రవాహ వేగంను ఇంజనీర్లు అప్రమత్తంగా ఉంటూ నీటి విడుదల చేస్తున్నారు.

# అందరి నోటా.. అదే మాట..!

- వ్యాపార ప్రచారాలుగా మారిన స్వాతంత్ర్య దినేత్సవ ర్యాలీ..!!
- సిమెంట్ కంపెనీ ప్లేకార్డులు ధరించిన విద్యార్థులు
- కోట్ల జయంతి వేడుకల్లోనూ...అదే తీరే ..!



**కోడుమూరు, ఆగష్టు 16, ప్రభాతవార్త :**

కోడుమూరు పట్టణంలో నిన్న జరిగిన 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా విద్యార్థులచే నిర్వహించిన ర్యాలీలు సిమెంట్ వ్యాపార ప్రచారకర్తల్లా మారడం గమనార్హం. ఇక్కడి ఒక ప్రైవేట్ విద్యా సంస్థకు చెందిన పాఠశాల ప్రాంగణం నుంచి పట్టణ పురవీధుల గుండా నిర్వహించిన ర్యాలీల్లో ఆ పాఠశాలకు చెందిన యాజమాన్యంతో పాటుపాఠశాల ప్రిన్సిపాల్, బోదకులంతా సిమెంట్ కంపెనీకి చెందిన ప్లేకార్డులను ధరించి పురవీధుల గుండా ప్రదర్శనివ్వడం శోచనీయం. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాల కాలం గడుస్తున్నా .. నేటి వరకూ కూడా దేశ భక్తిలో ప్రతి ఒక్కరికీ ఏ మాత్రం తగ్గకుండా ఉండేందుకు ప్రతి ఏటా నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ద్వారా రేపటి తరానికి ఆదర్శమివ్వాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను ఏటా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు అన్ని వర్గాల ప్రజలంతా ఎంతో ఆర్భాటంగా ఉత్సాహంగా పంద్రాగష్టు వేడుకల ప్రాధాన్యతను చాటుకోవడానికి ఎంతో ఘనంగా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

సిమెంట్ కంపెనీల ప్రచారాలకు అనుమతి ఇవ్వలేదు : కోడుమూరులో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించిన ర్యాలీల్లో విద్యార్థులతో సిమెంట్ వ్యాపార ప్రచారాలకు వినియోగించిన వాటికి తాము అనుమతి ఇవ్వలేదని మండల విద్యాధికారి వసంతలక్ష్మీ వివరణ ఇచ్చారు. ఈ విషయంపై తాను జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకువెళ్తానని సమాధానం ఇచ్చారు.



కోట్ల జయంతి వేడుకల్లో కూడా ..: శనివారం ఇక్కడ జరిగిన దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కరరెడ్డి 105వ జయంతి వేడుకల్లో కూడా ఒక సిమెంట్ కంపెనీకి ప్రచారాలకు ఉపయోగించుకోవడం శోచనీయం. వేడుకలనంతరం ఆ కంపెనీకి చెందిన హ్యాండ్ బ్యాగులను ఇక్కడికి వచ్చిన వారికి వాటిని అందించి చక్కగా వ్యాపార ప్రచారం చేసుకోవడంపై వీటిని చూసిన అక్కడి వారందరికీ నోటా మాట రాలేదు. ఇలా పట్టణంలో రెండు రోజుల పాటు జరిగిన కార్యక్రమాలకు యథేశ్చగా వ్యాపార ప్రచారాలకు వినియోగించుకోవడంపై స్థానిక ప్రజలంతా అందరి నోటా.. అదే మాటగా.. చర్చించు కోవడం కొసమెరుపు.

## యాదవ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

: వై. నాగేశ్వరరావు యాదవ్, డీసీఎంస్ చైర్మన్



**కర్నూల్ హాస్పిటల్ ఆగస్టు 16 ప్రభాతవార్త :**

ఈ రోజు డోన్ మరియు కర్నూలు లో శ్రీకృష్ణ మందిరము నందు గో పూజ, అభిషేకము, భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా డోన్ లో లీలితి సూర్య ప్రకాష్ రెడ్డి, కర్నూలు నందు లీలితి గౌరు చరిత రెడ్డి, బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి పాల్గొని రాష్ట్ర లో ప్రజలదరికి శుభం జరగాలని, వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండి రాష్ట్ర సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు.

## దసరా మహోత్సవాల ఏర్పాట్లకై సన్నాహక సమావేశం

**శ్రీశైలంప్రాజెక్టు, ఆగసు ్టి16, ప్రభాతవార్త**



శ్రీశైలం మహాపుణ్యక్షేత్రంలో సెప్టెంబర్ 22 నుండి అక్టోబర్ 02 వరకు దసర మహో త్సవాలు ప్రారంభం కానున్న నేపధ్యాయంలో శనివారంనాడు పరిపాలన భవనంలో మహో త్సవ ఏర్పాట్లపై అయా యూనిట్ల విభాగపు అదికారులు ఉభయ దేవాలయాల ప్రధాన అర్చకులు, ఆధ్యాపక, వేదపండింతులు, డిఈఓ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, పర్యవేక్షకులు దేవస్థానం కార్యనిర్వహణాదికారి ఎం.శ్రీనివాసరావు సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఈఓ ఎం.శ్రీనివాసరావు మాట్లడుతూ అన్ని విభాగాలు కూడా పరస్పర సమన్వయంతో ఉత ్సవాలను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టడంలో అన్ని విభాగాలు కూడా ప్రత్యేక దృష్టి కనబర్చాలన్నారు .అదే విధంగా ఉత్సవరోజులల్లో శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్ని పరిపూర్ణంగా జరిపించాలని వైదిక సిబ్బందికి సూచించారు. ఉత్సవ విశేషాలను వీక్షించేందుకు వీలుగా గంగాధర మండపం వద్ద ఎల్.ఈ.డి స్ర్కీన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఉత్సవాల్లో సంప్రదాయపద్ధతిలో తగిన విధంగా ప్రత్యేకంగా పుష్పాలంకరణ చేయాలని ఉద్యానవన విభాగాన్ని ఆదేశించడం జరిగింది. అదే విదంగా ఉత్సవాలలో భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉందని చెబుతూ పారిశుధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆ విభాగంను ఆదేశించారు. మధ్యాహ్న వేళల్లో అన్నప్రసాదాల వితరణ(అన్నదానానికి), రాత్రివేళల్లో అల్పాహారానికి తగు ఏర్పాట్లు చేయాలని ఆ విభాగంను ఆదేశించారు. భక్తులకు నిరంతరం మంచినీరు, అల్పాహారాలను అందజేస్తుండాలని తెలిపారు. సామాజీక మాధ్యామాలల్లో కూడా ఉత్సవాల సంబంధి విశేషాలను భక్తులకు తెలియజేస్తుండాలని ప్రచార విభాగాన్ని ఆదేశించారు. శ్రీస్వామిఅమ్మవార్ల గ్రామోత్స వంలో నాథస్వరంతోపాటు, కోలాటం, చెక్కభజన, నందికోలుసేవ, తప్పెటచిందు, మొదలైన జానపద కళారూపాల ప్రదర్శనను కూడా ఏర్పాటు చేయలన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఈ నరసింహరెడ్డి, ఏఈఓలు హరిదాసు, వెంకటేశ్వరరావు, మల్లికార్జున రెడ్డి, శ్రీనివాసరావు, ప్రజాసంబందాల ఆధికారి టి.శ్రీనివాసరావు, శ్రీశైలప్రభ సంపాదకులు డాక్టర్ అనిల్‌కుమార్ పాల్గోన్నారు.

## శ్రీశైల భ్రమరాంబాదేవికి బంగారుహరం..!



**శ్రీశైలంప్రాజెక్టు, ఆగస్టు16, ప్రభాతవార్త**



శ్రీశైల భ్రమరాంబాదేవి అమ్మఆరికి హైదరాబాద్ వాస్తవ్యులు తుగ్గలి నాగే ంద్ర దంపతులు బంగారు హరంను శనివారం నాడు శ్రీశైలదేవస్థానం ఈఓ ఎం.శ్రీనివా సరావు సమక్షంలో అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో దాతలు ఈ బంగారు హరాన్ని అందజేసారు. ముందుగా దాతలకు ఆలయ రాజగోపురం వద్ద అధికారులు, అర్చకస్వాములు సాదర స్వాగతం పలికారు. అనంతరం వారు ఉభయ దేవాలయాలను దర్శించుకోని పూజలు నిర్వహించుకున్నారు. ఈ బంగారు హరం 100గ్రాములతో తయారు చెయించిన బంగారు హరాన్ని(కాసులపేరు)దేవస్థానంకు సమర్పి ్ంచారు. ఈ సందర్భంగా దాతలకు తగు రశీదు, వేదపండింతులు వేధశీర్వచన వల్లించగా అర్చకస్వాములు తీర్థప్రసాదములు అందజేసారు. తదుపరి ఈఓ శ్రీనివాసరావు శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, అందజేసి శ్రీస్వామిఅమ్మవార్ల చిత్రపటంను భహుకరించారు. ఈ కార్యక్రమంలో వేధపండింతులు గంటి రాధకృష్ణమూర్తి, అమ్మవారి ఆలయం ఇన్ ్సపేక్టర్ కె.మల్లికార్జున తదితరులు పాల్గోన్నారు.

# పులివెందుల, ఒంటిమెట్టలో.. కూటమికి గెలుపుకాదు

**బనగానపల్లె, ఆగష్టు 16, ప్రభాతవార్తః**

వైయస్ఆర్ జిల్లాలో మొన్న జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఎన్నికల్లో అధికార కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం, కూని చేసి గెలిచిన గెలుపు ఒక గెలుపేనా అని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. శనివారం ఆయన స్వగృహంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ మొన్న జరిగిన పులి వెందుల, ఒంటిమిట్ట జడ్పీటిసి ఎన్నికలు ప్రజాస్వా మ్యయుతమైనవి కావని ఇదంతా ప్రజాస్వామ్య వాదులు గుర్తించాలన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకొని తెలుగుదేశం పార్టీ నాయకులు తమ అనుచరులచేత ఓట్లు వేయించుకున్నారని అక్కడ ఓటరు కానీ వారు ఓట్లు వేసి గెలుపు ఒక గెలుపేనా అని యద్దేవా చేశారు. పులివెందుల ఒంటిమిట్టలో స్థానికంగా ఉన్న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారని వందలాది మంది ఇతర ప్రాంతాల నుంచి వచ్చి దొంగ ఓటు వేసిన వైనం కూటమి ప్రభుత్వానికే చెల్లిందన్నారు. అన ్నమ్మయ్య జిల్లాకు చెందిన ఒక మంత్రి సమక్షంలో అనుచరులు ఒంటిమిట్ట ఎన్నికల్లో వైయస్ఆర్‌సీపీ ఏజెంట్‌పై దాడిచేయడం అమానుషం. ఓటర్లు ఓటు హక్కు



వినియోగించుకోవడానికి కాకీబూట్లను పట్టుకున్న దుస్థితి ఓటర్లుకు ఎక్కడా జరగలేదని ఆంధ్ర రాష్ట్ర చరిత్రలో ఇది ఒక దుర్ది దినం అన్నారు. పులివెందుల, ఒంటిమిట్ట, పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల్లో దౌర్జన్యాలకు పాల్పడిన కూటమి ప్రభుత్వంపై చోద్యం చుస్తున్న ఎన్నికల కమిషన్ పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటిసి ఎన్నికల్లో ఏ ఒక్కరిని విడిచిపెట్టం దోషులందరిని న్యాయస్థానంలో దోషులుగా నిలబెడతామన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలను సంపూర్ణంగా అమలుచేయలేని చేతగాని ప్రభుత్వమన్నారు. ఈకూటమి ప్రభుత్వంలో యూరియా అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో రైతాంగం యూరియా అందక ఇబ్బందులు ఎదుర్కొంటుంటే తెలుగుదేశం పార్టీ సంబరాలు చేసుకుంటుందన్నారు. ఈకార్యక్రమంలో అవుకు మండల వైసీపీ కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి, వైసీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, గుండం నాగేశ్వర్‌రెడ్డి, సీనియర్ న్యాయవాది అబ్దుల్ ఖైర్, బనగానపల్లె వైసీపీ కన్వీనర్ సన్నల జనార్ధన్‌రెడ్డి, రామన్న, వైసీపీ ముస్లీం మైనార్టీ

# నల్లమల ధళాదిపతికి చివరి కన్నీటి వీడ్కోలు

: వడ్లరామాపురం గ్రామంలో ముగిసిన మావోయిస్టు చినన్న అంతక్రియలు
: బౌతికదేహానికి నివాళ్లులర్పించేందుకు తరలి వచ్చిన నేతలు
: చివరిసారిగా మావోయిస్టు చినన్న మృతికి సంతాపం తెలిపిన ప్రజా సంఘాలు
: కన్నీటి పర్వంలో మునిగి తేలిన కుటుంబ సభ్యులు





**ఆత్మకూరు, ఆగష్టు16, ప్రభాతవార్త:**

నల్లమలలో మావోయిస్టుల దళాదిపతికి చివరి సారి కన్నీటి వీడ్కోలు పలికేందుకు గ్రామీణ ప్రాంత ప్రజలు, వివిద సంఘాల నేతలు పెద్ద ఎత్తున్న తరలి వచ్చి ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన సుగులురి చినన్న బౌతికదేహనికి పూలమాలతో ఘన నివాళ్లులు అరి ్ంచారు. గత మూడు రోజుల క్రితం చతీష్‌ఘఢ్ రాష్ట్రంలోని రాజ్‌నంద్‌గౌ జిల్లా మదన్వాడ కాంకర్ అటవీ సరిహద్దు ప్రాంతంలో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన సుగులూరి చినన్న మృతదేహని ఆ రాష్ట్రానికి చెందిన పోలీసు బలగాలు బందుమిత్రులకు అప్పగించారు. శనివారం నంద్యాల జిల్లా శ్రీశైలం నియోజకవర్గం ఆత్మకూరు మండల పరిధిలోని వడ్లరామాపురం గ్రామంలో సుగులూరి చినన్న మృతదేహానికి నివాళ్లులు అర్పించి అంతక్రియలు నిర్వహించారు. ముందుగా ప్రజా సంఘాల నాయకులు కుటుంబ సభ్యులు బార్య, పిల్లలతో పాటు గ్రామస్తులు పెద్దఎత్తున్న అక్కడికి చేరుకోని ప్రజా సంఘాల జననీరాజనం మద్యలో సుగులూరి చినన్నకు పెద్దఎత్తున్న అభిమానం చాటుకోని పెద్దఎత్తున్న ముందుకు సాగారు. 25 సంవత్సరాల తన జీవితంలో ప్రజలకు మేలు చేయాలనే ఆశయంతో ఓ ఉద్యమ నేతగా ఉంటూ మావోయిస్టు దళాదిపతిగా పనిచేసి ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన సుగులూరి చినన్న మృతదేహంతో పాటు అంతక్రియలు నిర్వహించేందుకు రాష్ట్రంలో నలుమూలల నుంచి పలువురు ప్రముఖులు, ప్రజా సంఘాల నేతలు పెద్ద ఎత్తున్న హాజరైయ్యారు. చివరి సారిగా కన్నీటి వీడ్కొలు తెలుపుతూ భార్య పిల్లలు సొకసంద్రంలో మునిగారు. అంత్యక్రియాలు ముగిసిన తర్వాత గ్రామీణ ప్రాంత ప్రజలు తమ గమ్యస్థానాలకు వెళ్లారు.

# చెరుకులపాడులో.. ముగ్గురికి డెంగ్యూ జ్వరాలు..!

- వారిలో ఇద్దరు చిన్నారులు,ఒకరు 15 సంవత్సరాల అబ్బాయి..
- వెల్దుర్తి మండలంలో ఇటీవలి కాలంలో 5గురు డెంగ్యూ జ్వరాల బారిన పడ్డారు..



**వెల్దుర్తి, ఆగస్టు16, ప్రభాతవార్త**

మండలంలోని చెరుకులపాడు గ్రామంలో ముగ్గరికి డెంగ్యూ జ్వరాలు వచ్చినట్లు తెలిసింది. గ్రామంలోని ఊరివాకిలి వద్ద ఉంటున్న బత్తిన సురేంద్ర, చంద్రకళల 4 సంవత్సరాల కుమార్తె బత్తిన అక్షర, కురువ వీధిలో నివాసముంటున్న నెరవాటి రామాంజనేయులు, నెరవాటి అంజనమ్మల 8 సంవత్సరాల కుమార్తె నెర వాటి రాధిక, ఎస్సీ కాలనీలో ఉంటున్న రత్నం, రాజమ్మల 15 సంవత్సరాల కుమారుడు హర్ష అనే అబ్బాయిలకు తీవ్రమైన జ్వరాలు రావడంతో వారు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆగస్టు8న చేర్పించారు. అయితే అక్కడ వైద్యుల సూచనల మేరకు వైద్యపరీక్షలు నిర్వహించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. తమ పిల్లలకు డెంగ్యూ జ్వరాలు వచ్చినట్లు, రక్తకణాలు తక్కువగా ఉన్నట్లు వైద్యులు చెప్పారన్నారు. మరికొన్ని రోజులు వైద్యసేవల అనంతరం డిశ్చార్జ్ చేస్తామన్నారని తల్లితండ్రులు తెలిపారు.

**- వెల్దుర్తి మండలంలో ఇప్పటివరకు 5గురికి డెంగ్యూ జ్వరాలు..**

వెల్దుర్తి మండలంలో ఇప్పటివరకు 5గురికి డెంగ్యూ జ్వరాలు వచ్చినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలిసింది. వీరిలో వెల్దుర్తి, బింగిదొడ్డి గ్రామాల్లో ఒక్కొక్కరికి డెంగ్యూ జ్వరం వచ్చినట్లు ఈనెల12న వెల్దుర్తిలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆరోగ్యశాఖ సూపర్‌వైజర్లు స్వయంగా వివరించారు. ఇక మండలంలోని చెరుకులపాడు గ్రామంలో ముగ్గురికి డెంగూ ్య జ్వరాలు నిర్దారణ అయినట్లు కుటుంబ సభ్యులకు వైద్యులు తెలిపినట్లు సమాచారం. వారు ఇప్పటికి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యచికిత్సలు పొందుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మండల అధికారుల పర్యవేక్షణ లోపమా, పారిశుద్ధ్యలోపమా జిల్లాఅధికారులకే తెలియాల్సి ఉంది. దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. జ్వరాలు, సీజనల్‌వ్యాధులపై అవగాహన కల్పించాల్సిన వైద్యశాఖసిబ్బంది జ్వరాలు వచ్చినప్పుడే కనపడతారని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు గ్రామాల పర్యవేక్షణ చేయకపోవడంతో అధికారులు సమయపాలన పాటించడం లేదని మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు అంటున్నారు. ప్రజలు విష జ్వరాల బారిన పడకుండా జిల్లాఅధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో రాష్ట్రం ముందంజ




**కర్నూల్ హాస్పిటల్ ఆగస్టు 15 ప్రభాతవార్త**

79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా కర్నూలు పెరేడ్ గ్రౌండ్లో నిర్వహించిన శకటాల ప్రదర్శనలో వైద్య ఆరోగ్యశాఖ ప్రదర్శించిన శిఖరానికి సంబంధించి రాష్ట్ర వాణిజ్య పరిశ్రమలు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ప్రతి పౌరుడికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మాతాశిశు మరణాలను నివారించేందుకు గర్భవతులు, బాలింతలకు రక్తహీనత నివారణ, ప్రసూతి మరణాలు జరగకుండా ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోంది.

## నారాయణ స్కూల్ లో కృష్ణాష్టమి వేడుకలు

- విద్యార్థుల ఆకట్టుకున్న వేషధారణ



**కర్నూల్ హాస్పిటల్ ఆగస్టు 16 ప్రభాతవార్త :**

నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కృష్ణాష్టమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాఠశాలల ఏజీఎం రమేష్ కుమార్ విచ్చేసి, ముందుగా శ్రీకృష్ణుడు మరియు గోపికల వేషధారణలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులందరికీ కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కృష్ణాష్టమి అంటే శ్రీకృష్ణుడి జన్మదినోత్సవం అని, ఇది హిందూ మతంలో అత్యంత ప్రధానమైన పండుగలలో ఒకటని తెలిపారు. శ్రీకృష్ణుడు విష్ణువు యొక్క ఎనిమిదవ అవతారమని, భగవద్గీతను బోధించి ధర్మాన్ని స్థాపించడానికి భూమిపై అవతరించారని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇ. నిజేంద్ర గౌడ్, హై స్కూల్ డీన్ శివయ్య, ఈచాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ శిరీష, ఈకిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ స్వాతి, ఏఓ హుసేన్ మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## మైనర్ బాలికపై యువకుడి అత్యాచారం

- 8 నెలల గర్భవతిని చేసిన ప్రబుద్ధుడు
- ప్రభుత్వాసుపత్రిలో మగశిశువుకు జన్మనిచ్చిన బాలిక
- తల్లిదండ్రుల ఫిర్యాదుపై కేసునమోదచేసిన పోలీసులు

**బనగానపల్లె, ఆగష్టు 16, ప్రభాతవార్తః**



మైనర్ బాలికను మాయ మాటలతో లోబరుచుకొని బాలికను గర్భవతినిచేసిన ప్రబుద్ధిడి కథ అలస్యంగా వెలుగులోకి వచ్చింది. బనగా నపల్లె మండల పరిధిలోని కైప గ్రామంలో వెలుగుచూసిన ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదచేసిన గ్రామీణ సిఐ మంజునాథ్‌రెడ్డి విచారణ చేపట్టారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు కైప గ్రామానికి చెందినయువకుడు మనోహర్ వయసు 21 అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికను లోబరుచుకునే ఉద్దేశ్యంతో మాయమాటలు చెబుతూ ఉండేవాడు ఇద్దరి ఇల్లు దగ్గరకావడంతో మాయమాటలు చెబుతూ బాలికను మెల్లగా తనవైపు మలుచుకున్నాడు. బాలిక తన మాట వింటుందని గ్రహించిన ప్రబుద్ధుడు బాలికను ఇంట్లోకి తీసుకెళ్లి బాలికపై ఒక సంవత ్సరం నుండి అత్యాచారానికి పాల్పడు తుండేవాడని ఈనేపద్యంలో నిన్నటి దినం కూతురుకు కడుపునొప్పిరావడంతో తల్లిదండ్రులు బాలికను బనగానపలె ్ల ఆసుపత్రికి తీసుకువచ్చారు. బాలికను పరీక్షించిన వైద్యులు బాలిక గర్భవతి అని చెప్పారని ఈపరిస్థితుల్లో బాలిక మగశిశువుకు జన్మనిచ్చిందని తెలిపారు. సంఘటనపై దిక్కుతోచని బాలిక తల్లిదండ్రులు నందివర్గం పోలీస్‌స్టేషన్‌లో వారి కూతురికి జరిగిన అన్యాయంపై ఫిర్యాదుచేశారని ఈమేరకు ఫోక్స్ చట్టం కింద కేసు నమోదుచేసి విచారణ చేపట్టినటు ్ల బనగానపల్లె రూరల్ సిఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు.

## కర్నూల్ ట్రాఫిక్ హేల్మేట్ తప్పనిసరి.

: ఏడు సీట్లు గల ఆటోలను పట్టణంలోకి అనుమతి లేదు
: కర్నూలు ట్రాఫిక్ సిఐ మన్సూరుద్దీన్

**కర్నూలు ఆగస్టు 17 : ప్రభాతవార్త ప్రతినిధి :**

కర్నూలు జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు మరియు కర్నూల్ డిఎస్పి శ్రీ బాబు ప్రసాద్ గారి ఉత్తర్వుల మేరకు కర్నూల్ పట్టణ ప్రజలకు కర్నూల్ ట్రాఫిక్ సిఐ మన్సూరుద్దిన్ శనివారం ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు నడుపు ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించవలెననీ, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనదారులు నడిపిన ఎడల మోటర్ వెహికల్ చట్టం ప్రకారము సదరు వాహనంలకు చాలాన ఫైన్ విదించబడుతుందని కావున ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనంలో నడిపిన యెడల వారి ప్రాణములను కాపాడుకుంటూ తమ కుటుంబ సభ్యుల భవిష్యత్తుకు భరోసా ఇచ్చిన వారు అవుతారని కావున హెల్మెట్ ధరించి వాహనం నడపవలెనని విజ్ఞప్తి చేస్తున్నాము. సెవెన్ (7) సీటర్ ఆటోలు నడువు డ్రైవర్లకు తెలియజేయడమేమనగా వివిధ గ్రామాల నుండి కర్నూలు పట్టదానికి సెవెన్ సీటర్స్ నడుపు వాహనదారులు తమ ఆటోలను కర్నూలు పట్టణ శివారులోని నంద్యాల చెక్ పోస్ట్, గుత్తి పెట్రోల్ బంక్, బళ్లారి చౌరస్తా మరియు శ్రీ. జోసఫ్ కాలేజ్ నందు నిలుపుకోవాలని తెలియజేయుచున్నాము, కర్నూలు పట్టణంలోకి ప్రవేశించిన యెడల చలానా ఫైన్ విధించబడును మరియు ప్రజలు కూడా ఈ విషయం గమనించి సహకరించగలరనీ కోరుచున్నాము. కర్నూలు ఓల్డ్ సిటీ రాధాకృష్ణ టాకీస్ నుండి నెహ్రూ రోడ్ (బొంగుల బజారు) మరియు మించనుబజార్ రూట్ లను వన్‌వే చేయడమైనది కావున ప్రజలు మించను బజార్ రూట్ ద్వారా వెళ్లి తిరిగి నెహ్రూ రోడ్ (బొంగుల బజారు) రోడ్ లో రావాల్సి ఉంటుంది కావున ప్రజలు గమనించి సహకరించగలరని కర్నూల్ ట్రాఫిక్ సిఐ మన్సూరుద్దిన్ గారు తెలపడమైనది.